# పెట్రోల్ బంక్ లో అగ్నిప్రమాదం..

సికింద్రాబాద్, ఆగష్టు 23: మల్లాపూర్ లోని షెల్ పెట్రోల్ బంక్ లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. షెల్ పెట్రోల్ బంక్ కొద్దీ రోజులుగా మూతపడ్డది. పెట్రోల్ బంక్ లో మరమత్తు పనులు చేస్తుండగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 24-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 17 పేజీలు 8 వెల: రూ.1/-


## ఇది ఇన్‌ఫ్రా బంధం.. యునెస్కోలో మోదీ ప్రసంగం




హైదరాబాద్, ఆగష్టు 23: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉన్న యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ ఇవాళ భారతీయ సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత్ అన్ని రంగాల్లో దూసుకువెళ్తోందని మోదీ అన్నారు. తాము కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని, కొత్త భారత్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. ఫ్రాన్స్ ప్రజలు ఫుట్‌బాల్ ఆటను ఇష్టపడుతారని, ఆ ఆటలో గోల్ ప్రాముఖ్యత అందరికీ తెలుసు అని, గోల్ కొట్టడం అంటే అత్యున్నత లక్ష్యాన్ని చేధించడమే అని, గత అయిదేళ్లలో తమ ప్రభుత్వం అలాంటి లక్ష్యాలనే పెట్టుకుందన్నారు. చేసిన ప్రమాణాలను మరిచే వ్యక్తిని తాను కాదు అని ఆయన అన్నారు. స్టార్ట్ అప్స్‌లో ఇండియా ముందుకు వెళ్తోందన్నారు. కొత్త దేశాన్ని నిర్మించనున్నామని, దానిలో భాగంగానే అవినీతిని అంతం చేస్తున్నామన్నారు. కుటుంబ రాజకీయాలకు కూడా చెక్ పెట్టామన్నారు. ప్రజాధనాన్ని దోచుకునేవారిని అరికట్టామన్నారు. ఉగ్రవాదాన్ని అడ్డుకున్నామన్నారు. గతంలో ఎన్నుడూ ఇలాంటి చర్యలు గత ప్రభుత్వాలు చేపట్టలేదన్నారు. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల సంరక్షణ, హెల్త్‌కేర్ లాంటి అంశాల్లో అనేక చర్యలు చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ పార్లమెంట్ ఇంత సజావుగా సాగలేదని, గత సెషన్‌లో 75 బిల్లులు పాస్ చేశామన్నారు. చంద్రయాన్2 వ్యోమనౌక త్వరలోనే చంద్రుడిపై ల్యాండ్ అవుతుందన్నారు. అప్పుడు భారత్.. ఎలైట్ దేశాల సరసన నిలుస్తుందన్నారు. భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాలు మరింత పురోగతి దిశగా సాగుతున్నాయన్నారు. ఉగ్రవాదమైనా.. వాతావరణమైనా.. భారత్, ఫ్రాన్స్ కలిసి పోరాడుతున్నాయన్నారు. ఇండియా, ఫ్రాన్స్ దేశాలు అనేక రంగాల్లో ముందుకు వెళున్నాయన్నారు.

## చిదంబరానికి మధ్యంతర బెయిల్



హైదరాబాద్, ఆగష్టు 23: మాజీ కేంద్ర మంత్రి చిదంబరానికి ఇవాళ సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరాన్ని అరెస్టు చేయకుండా ఉండేందుకు ఆ ఆదేశాలు ఇచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఆ కేసును విచారిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 26వ తేదీ వరకు ఆ వెసలుబాటు కల్పించారు. అయితే ఇదే కేసులో రెండు రోజుల క్రితం చిదంబరాన్ని హైడ్రామా మధ్య సీబీఐ పోలీసులు చిదంబరంను అరెస్టు చేశారు.

ఇవాళ సుప్రీంకోర్టులో చిదంబరం బెయిల్‌కు సంబంధించి వాదనలు జరిగాయి. సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో తన వాదన వినిపించారు. చిదంబరానికి వ్యతిరేకంగా సాక్ష్యాలన్నీ డిజిటిల్ డాక్యుమెంట్లు, ఈమెయిళ్ల రూపంలో ఉన్నట్లు సోలిసిటర్ జనరల్ తెలిపారు.

మనీల్యాం డరింగ్ పద్ధతిలో అవినీతి సొమ్ము మాయమయిందన్నారు. చిదంబరానికి విదేశాల్లో 10 ప్రాపర్టీలు, 17 బ్యాంకు అకౌంట్లు ఉన్నట్లు తుషార్ మెహతా చెప్పారు. అయితే సోమవారం రోజున సీబీఐ, ఈడీ కేసులను సుప్రీం విచారించనున్నది. అప్పటి వరకు చిదంబరం సీబీఐ కస్టడీలోనే ఉంటారని కోర్టు చెప్పింది. చిదంబరానికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లును సోలిసిటర్ జనరల్ కోర్టుకు సమర్పించే ప్రయత్నం చేశారు. కానీ లాయర్లు సిబల్, సింఘ్వీలు దాన్ని అడ్డుకున్నారు. అయితే ప్రతి అంశాన్ని సోమవారమే వింటామని కోర్టు స్పష్టం చేసింది.

## బిజెపి రాజకీయ వికృత క్రీడలు

### మండిపడ్డ సిపిఐ నేత నారాయణ

హైదరాబాద్,ఆగస్టు23 (ఆంఎన్ఎ): మతమార్పిడి శుద్ధికి బదులు భ్రష్టులకు శుద్ధిచేసి... బీజేపీలో చేర్చుకోవడమే సంఘ్ పరివార్ విధానమని సీపీఐ నేత నారాయణ విమర్శించారు. ఇతర పార్టీల వారిని పెద్ద ఎత్తున పార్టీలో చేర్పించుకుంటూ తమపార్టీ బలపడిందని బిజెపి చంకలు గుద్దుకుంటోందని మండిపడ్డారు. బిజెపి తీరు ప్రమాదకరంగా మరిందన్నారు. దీనిపై అప్రమత్తం కావాల్సి ఉందన్నారు. నగరంలోని మఖ్దూం భవన్‌లో జరగుఉతన్న సిపిఐ సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీజేపీలో చేరగానే వాళ్లంతా పునీతులైనట్లు చెప్పడం.. బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. బీజేపీని వ్యతిరేంచే ముఖ్యులను హింసించడమే ఈనాటి రాజ్యపాలన అని.. దానికి ఉదాహరణెళి రెడ్డి బ్రదర్స్‌కు అందలం..చిదంబరానికి అంధకారం అని నారాయణ వ్యాఖ్యానించారు. ఇలాంటి నీచ రాజకీయాలకు బిజెపి తెరతీసిందన్నారు. లెఫ్ట్ పార్టీగా మనం ఎప్పటికప్పుడు ఈ చర్యలను ఎండగట్టాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, మాజీ కార్యదర్శి, పార్టీ సీనియర్ నేత సరవరం సుధాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## బ్లాక్ మార్కెట్లో తత్కాల్ టిక్కట్లు

### ముగ్గురిపై రైల్వే పోలీసుల దాడి

హైదరాబాద్,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): రైల్వే తత్కాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో స్వీకరించి.. విక్రయిస్తున్న ముగ్గురిపై సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.బెనయ్య తెలిపిన ప్రకా రం... నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా తత్కాల్ టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా తీసుకొని రైల్వే ప్రయాణికులకు అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రెండు రోజులపాటు ఉప్పల్, నేరెడ్‌మెట్, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆయా కేంద్రాలపై దాడులు నిర్వహించామని, ఇందులో భాగంగా సూరిబాబు, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.శేషారావులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.43,852 విలువైన టికెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. తత్కాల్ టికెట్లను కొందరు తప్పుడు కోడ్‌లతో తీసుకుంటూ విక్రయిస్తున్నట్లు రైల్వే అధికారులకు సమాచారం అందింది. దీంతో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా, ఐఆర్‌సీటీకి సంబంధించి ఎలాంటి లైసెన్స్ లేకుండా టికెట్లను తీసుకుంటూ కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### ఆఫ్ఘన్ ఉగ్రవాదులతో ..

## కశ్మీర్, ఢిల్లీలో దాడులకు పాక్ కుట్ర

**- తమిళనాడులో ఉగ్రవాదుల చొరబాటు!**

**- శ్రీలంక మీదుగా దేశంలోకి లష్కరే ముష్కరులు**

**- నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్రంలో హైఅలర్ట్**

న్యూఢిల్లీ, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : కశ్మీర్ విషయంలో ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని గోబెల్స్ ప్రచారం చేస్తోన్న దాయాది పాకిస్థాన్.. మరోసారి భారీ ఉగ్రదాడికి వ్యూహరచన చేసినట్టు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈసారి కశ్మీర్‌లో పెద్దఎత్తున మారణహోమం సృష్టించేందుకు కుట్రపన్నినట్టు ఐబీ తెలిపింది. ఆఫ్ఘన్ ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపి దాడులకు ప్రయత్నిస్తున్నట్టు నిఘా వర్గాలు పసిగట్టాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో కల్లోలానికి కుట్రలు పన్నుతోన్న పాపిస్థాన్.. ఉగ్రవాదుల చొరబాట్లకు సిద్ధం చేసింది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాల వద్ద ఉగ్రవాదులు చొరబాటుకు సిద్ధంగా ఉన్నట్టు నిఘా సంస్థలు పేర్కొన్నాయి. కశ్మీర్‌తోపాటు దేశ రాజధానిలో ఉగ్రదాడులకు చాలా మంది ఆఫ్ఘన్ ఉగ్రవాదులును సిద్ధంచేసనట్టు ఐబీ వర్గాలు తెలిపారు. అంతేకాదు, కశ్మీర్‌లో భద్రతా బలగాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్టు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో రాజకీయ నేతలను సైతం టార్గె÷-÷- చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. జమ్మూ కశ్మీర్‌లోని భద్రత సిబ్బందిపై దాడులకు పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ ఇప్పటికే వ్యూహరచన చేసినట్టు రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) నివేదిక హెచ్చరించింది. రా నివేదిక ప్రకారం... ఆగస్టు 19న పాకిస్థాన్ బహ్వాల్పూర్‌లోని మర్కజ్ ఉస్మాన్ ఓ అలీలో జైషే ఉగ్రవాద సంస్థ ఓ ప్రత్యేకంగా సమావేశమైనట్టు తెలిసింది. జేషే అధినేత మసూద్ అజార్ సోదరుడు, ఆ సంస్థ ఆర్మ్‌డ్ వింగ్ కమాండర్ రౌఫ్ అస్ఘర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. అలాగే పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు కశ్మీర్‌లోని పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, అధికారులు, జమ్మూ కశ్మీర్ పోలీసులను టార్గెట్ చేసినట్టు మరో సమాచారం నిఘా వర్గాలకు అందింది. కశ్మీర్‌లో పరిసితులు ఇప్పుడిప్పుడే చక్కబడతుండగా, ఉగ్రదాడుల హెచ్చరికలతో జనం మరింత ఆందోళన చెందుతున్నారు. ఉగ్రమూకలు ఎప్పుడు విరుచుకుపడతాయోనని భయపడుతున్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందే కశ్మీర్‌కు భారీగా బలగాలను తరలించిన కేంద్రం.. అక్కడ కట్టుదిట్టమైన భద్రతను కల్పించింది. కానీ, సరిహద్దుల్లోని భారత సైనిక స్థావరాలపై పాకిస్థాన్ దాడులకు పాల్పడి ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపేందుకు ప్రయత్నిస్తోంది.

### తమిళనాడు వ్యాప్తంగా హై అలర్ట్..

భారత్‌లోకి చొరబడిన ముష్కరుల్లో ఒకరు పాకిస్థానీ కాగా.. ఐదుగురు శ్రీలంక తమిళ ముస్లింలుగా తెలుస్తోంది. హిందువులుగా దేశంలోకి చొరబడి ఉగ్ర చర్యలకు కుట్ర పన్నుతున్నారని నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. రద్దీ ప్రదేశాలు, ప్రముఖ రాజకీయ నాయకులు, విదేశీ రాయబార కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకుని వీరు దాడులకు పాల్పడే ప్రమాదముందని పేర్కొన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను ముమ్మరం చేశారు. కొయంబత్తూర్‌లో హై అలర్ట్ ప్రకటించారు. నగరంలోని అన్ని వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అటు చెన్నైలో బలగాలను పెంచారు. ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్, ఆలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. తీర ప్రాంత జిల్లాలన్నింటికీ హెచ్చరికలు జారీ చేశారు.

## మియాపూర్‌లో దారుణ ఘటన

### స్నేహితుల కిరాతకానికి బలైన ఆటో డ్రైవర్

### తల,మొండెం వేరు చేసిన దుండగులు

### ఇద్దరు వ్యక్తుల పట్టివేత...కొనసాగుతున్న దర్యాప్తు

హైదరాబాద్,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో తోటి స్నేహితుడినే దారుణంగా హత్యచేశారు. ఆటో డ్రైవర్ అయిన ఆ వ్యక్తిని హత్య చేసి, తలను మొండెంనుంచి వేరు చేసి దూరంగా పడేశారు. ఈ సంఘటన శుక్రవరాం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు మేరకు.. గురువారం రాత్రి ప్రవీణ్(24) అనే ఆటో డ్రైవర్‌ను స్నేహితులైన శ్రీను, శ్రీకాంత్‌లు మద్యం సేవించటానికి పిలిచారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దీప్తి శ్రీనగర్ ధర్మపురి క్షేత్రం వద్ద మరో వ్యక్తితో కలిసి నలుగురు మద్యం సేవించారు. పూటుగా మద్యం సేవించిన తర్వాత పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని శ్రీను, శ్రీకాంత్‌లు ప్రవీణ్‌పై గొడవకు దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం అతడ్ని హత్య చేశారు. అనంతరం తలను మొండెంనుంచి వేరుచేసి దూరంగా బొల్లారం చౌరస్తాలో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్య కేసులో నిందితులైన శ్రీను, శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నారు. ఇకపోతే గడ్డం ప్రవీణ్ అనే ఆటో డ్రైవర్‌ను హత్య చేసి తల, మొండెం వేరు చేసిన కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను మియపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్తి శ్రీ నగర్ ధర్మపురి క్షేత్రం నిర్మానుష్య ప్రాంతంలో ఘటన జరిగింది. ప్రవీణ్‌ను శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ అనే ఇద్దరు బావ, బావమరుదులు హత్య చేసినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. వీరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. మృతుడు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్ ముగ్గురు స్నేహితులన్నారు

## సీబీఐ విచారణకు కూడా మేము సిద్ధమే!

హైదరాబాద్, ఆగష్టు 23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అవగాహన లేక విద్యుత్ సంస్థలపై ఆరోపణలు చేశారని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు అన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని లక్ష్మణ్ చేసిన ఆరోపణలను ట్రాన్స్‌కో ప్రభాకర్ రావు ఖండించారు. ఇవాళ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొనుగోళు, ఒప్పందాలపై ప్రభాకర్‌రావు వివరణ ఇచ్చారు. "రాష్ట్రం ఏర్పడే నాటికి 71 మెగావాట్లు సోలార్‌పవర్ ఉండేది. ఇప్పుడు సోలార్‌పవర్ 3,600 మెగావాట్లకు పెరిగింది. ఎంతో పారదర్శకంగా విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. ఛత్తీస్‌గఢ్ నుంచి రూ.3.90పైసలకు విద్యుత్‌ను కొంటున్నాం. రూ.4.30 పైసలకు విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్టీపీసీ ఎప్పుడూ చెప్పలేదు. 800 మెగావాట్ల ప్లాంట్‌ను దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు సందర్శించారు. విద్యుత్ సంస్థలు పూర్తి స్వతంత్రమైనవి. మాపై ఎలాంటి ప్రలోభాలు ఒత్తిళ్లు లేవు. మేం ఎటువంటి ఒత్తిడులకు లొంగడం లేదు. రాత్రికి రాత్రే పీపీఏలు కుదుర్చుకున్నారనడం అవాస్తవం. విద్యుత్ ఉద్యోగుల పనితీరుపై అవాస్తవాలు ప్రచారం చేయొద్దు. మా పనితీరుపై అనుమానాలుంటే సీబీఐ విచారణకు కూడా మేము సిద్ధమని ప్రభాకర్‌రావు" పేర్కొన్నారు.

### పాక్ కాల్పులు..

## భారత జవాను మృతి

శ్రీనగర్, ఆగష్టు 23: పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. భారత సైనిక శిబిరాలే లక్ష్యంగా జమ్మూకశ్మీర్ నౌషేరా సెక్టార్‌లోని ఎల్‌వోసీ వద్ద పాకిస్థాన్ రేజంర్లు కాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో భారత జవాను రజీబ్ తపా ప్రాణాలు కోల్పోయారు. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ అచలుండని పూజింతును
రుచిరమ్మగు శైలిలోన లోకులు మెచ్చన్
వచనములో వేదములను
రచియించిన దాశరథీ సి- రంగాచార్యన్!!

-రాధశ్రీ

( ఆగష్టు 24 దాశరథి రంగాచార్య జననం)

సెల్: 9494481210

## ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

హైదరాబాద్, ఆగష్టు 23: ఉత్తరాఖండ్‌లో ఇవాళ ఓ హెలికాప్టర్ కూలింది. సహాయక సామాగ్రి మోసుకువెళ్తున్న ఆ హెలికాప్టర్ టికోచి ఏరియాలో నేలకూలింది. ఆ హెలికాప్టర్‌లో ఉన్న పైలట్‌తో సహా కోపైలట్ స్వల్ప గాయాలకు గురయ్యారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో మరో దుర్ఘటన చోటుచేసుకుంది. షిమ్లా సమీపంలో మిలిటరీ వాహనం ఒకటి రోడ్డుపై స్కిడ్ అయ్యింది. ఈ ఘటనలో ఓ ఆర్మీ జవాను మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. గాలు నుంచి లంబీదార్ మధ్య ఈ ప్రమాదం జరిగింది.

## రాజ్యసభ సభ్యునిగా మన్మోహన్ సింగ్ ప్రమాణం



న్యూఢిలీ, ఆగష్టు 23 : మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్మోహన్ సింగ్ రాజ్యసభ సభ్యునిగా ఇవాళ ప్రమాణస్వీకారం చేశారు. మన్మోహన్ సింగ్ చేత రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, గులాం నబీ ఆజాద్‌తో పాటు పలువురు హాజరయ్యారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్.. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. 1991-2019 మధ్య దాదాపు 3 దశాబ్దాలు అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ఈ దఫా అసోం నుంచి అవకాశం లేకపోవడంతో రాజస్థాన్ నుంచి పోటీచేశారు మన్మోహన్ సింగ్. దాదాపు మూడు దశాబ్దాలు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన మన్మోహన్ సింగ్ 2004- 14 మధ్య రెండు దఫాలు దేశ ప్రధానిగా సేవలందించారు. ఈ ఏడాది జూన్ 14తో రాజ్యసభ సభ్యుడిగా ఆయన పదవీకాలం ముగిసింది. అసోం నుంచి రాజ్యసభకు పంపేందుకు కాంగ్రెస్‌కు సరిపడా బలం లేకపోవడంతో.. ఈ దఫా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యేందుకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. 200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 100 మంది సభ్యుల బలం ఉన్నది. అలాగే 12 మంది స్వతంత్ర్య సభ్యులు కూడా కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో మన్మోహన్‌సింగ్ గెలుపు సాధ్యమైంది.

## మళ్ళీ విస్తరిస్తున్న మాదకద్రవ్య సామ్రాజ్యం..!

నేటి నిజం
శనివారం 24-8-2019

భాగ్యనగరం కేంద్రంగా మాదకద్రవ్య సామ్రాజ్యం చాపకింద నీరులా విస్తరిస్తూ కొత్తపుంతలు తొక్కుతోంది. పాన్‌డబ్బీలు, గల్లీల్లో రహస్య లావాదేవీలు జరిపే పాతనేరగాళ్లు కావివి. కార్యాలయాలు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, పాఠశాలలు, కళాశాలల్లో... ఎక్కడ కోరుకుంటే అక్కడ పిజ్జాలు, బర్గర్ల తరహాలో మాదకద్రవ్యాల పంపిణీ శాఖోపశాఖలుగా విస్తరించి నిక్షేపంగా వర్ధిల్లుతోంది. కొరియర్ సర్వీసులు, ఆన్‌లైన్ సేవల పుణ్యమా అని అంతర్జాలంలో మూడు ఆర్డర్లు, ఆరు చెల్లింపులుగా చీకటిదందా ఇంతలింతలవుతోంది. యోజనాల మేర విస్తరించిన కొండచిలువలా మత్తు వ్యసనం అసంఖ్యాక పంజాబీల జీవితాల్ని చుట్టేస్తున్నదని అక్కడి అధికారులే వాపోతున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి లక్ష జనాభాకు 250 మంది చొప్పున మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారున్నారని కొన్నేళ్ల క్రితం కేంద్ర సాంఘిక న్యాయ సాధికార మంత్రిత్వశాఖ లెక్కచెప్పింది. జాతీయ సగటుకు మూడింతలకు పైగా ఆ సంఖ్య పంజాబులో 836 అంటున్న అక్కడి అధ్యయన నివేదికాంశాలు దిగ్భ్రాంతపరుస్తున్నాయి. గత సంవత్సరమంతా సోదాల్లో 200 కిలోల హెరాయిన్ పట్టుకున్న పంజాబ్ పోలీసులు ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే దాదాపు అంతటి రాశిని వెలికితీశారు. సరిహద్దు భద్రతా దళం తనిఖీల్లోనూ పెద్దయెత్తున డ్రగ్స్ దొరుకుతున్నాయి. తమ యువజనుల్లో మూడొంతులు మాదకద్రవ్యాలు రుచిచూసిన వారేనని, కనీసం ఒక్కరైనా డ్రగ్స్‌కు బానిసలైనవారున్న గ్రామీణ కుటుంబాలు 67 శాతమని పంజాబ్ సామాజిక భద్రత సర్వే వాపోయింది. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఇరాన్ నుంచి నిర్నిరోధ సరఫరాలు కీలక సరిహద్దు రాష్ట్రంమీద దట్టంగా మత్తుమేఘాల్ని పరివేస్తున్నాయి. ఆ మధ్య గుజరాత్ తీరానికి పాక్ నుంచి వచ్చిన పడవలో రెండు వందల ప్యాకెట్ల హెరాయిన్ పట్టుబడింది. అంతర్జాతీయ విపణిలో ఆ సరకు విలువ సుమారు రూ.600 కోట్లు. అక్కడ, ఈశాన్య భారతంలోనే కాదు– తెలుగుగడ్డపైనా ద్వితీయశ్రేణి పట్టణాల్లో సైతం ఇప్పుడు కొకైన్, గంజాయి చాక్లెట్లు లభిస్తున్నాయి. ఆన్‌లైన్ విక్రయాలు, సత్వర సరఫరాల కారణంగా మారుమూల ప్రాంతాల్లోనూ మత్తు సంస్కృతి చిలవలు పలవలు వేసుకుపోతోంది. అంతర్జాలంలో కొనుగోళ్లు చేసి భాగ్యనగర పరిసర ప్రాంతాల్లో సరఫరాలు సాగిస్తూ పోలీసు వలలో చిక్కిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి– తాను నివసిస్తున్న బహుళ అంతస్తుల భవనంలో గంజాయి మొక్కలు పెంచుతున్న బాగోతం ఈ వారమే బట్టబయలైంది. డార్క్‌నెట్, డీప్‌వెబ్ లావాదేవీల ద్వారా విదేశాల నుంచి ఖరీదైన మాదకద్రవ్యాలు తెలుగు రాష్ట్రాలకు చేరుతున్నాయన్న విశ్లేషణాత్మక కథనాలు నివ్వెరపరుస్తున్నాయి. అటువంటి లావాదేవీల గుట్టుమట్లను వెలికితీయడం కష్టతరమని నార్కొటిక్స్ విభాగం చేతులెత్తేస్తున్న దశలో, దీటైన చర్యలకు ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కించడమేమిటి? ఈ ఆగస్టు నెలాఖరులోగా దేశంలో మాదక ద్రవ్యాలపై విధానపరమైన మార్గనిర్దేశాలు సిద్ధమైతీరాలని సర్వోన్నత న్యాయస్థానం గడువు విధించినా, ఆ దిశగా ఇప్పటివరకు ఎక్కడా సందడే లేదు!

# గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారం

### కసరత్తుచేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం

మంచిర్యాల,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): జిల్లాలో నెలకొన్న వివిధ భూ సమస్యలపై గ్రామసభల ద్వారా రైతుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు రికార్డులు వారి ముందు ఉంచుతామని అధికారులు అన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్, ఫారెస్ట్, వారసత్వంగా వచ్చినవి, తదితర భూముల సమస్యలు నెలకొన్నాయని, ఇందులో రెవెన్యూ అధికారులు పరిష్కరించేవి కొన్నిఉంటే, సివిల్‌కోర్టు, రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్నాయన్నారు. భూ సమస్యలకు రెవెన్యూ అధికారులు బాధ్యత కాదని పేర్కొన్నారు. మే నెలలో మండల స్థాయిలో నిర్వహించిన భూ సమస్యల పరిష్కార వేదికలో 16వేల వరకు అర్జీలు రాగా అందులో 4 వేల సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. కొన్ని సివిల్ తగాదాలు, కోర్టు పరిధిలోనివి.. తాతలు, తండ్రుల నుంచి వస్తున్న భూములు సాగు చేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. కాస్తులో వారిపేరు, ఇతర రికార్డులు వారివద్ద ఉంటే చూపించాల్సి ఉంటుందని, వాటి ఆధారంగా రెవెన్యూ రికార్డులో ఉన్న వాటిని పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. వారసత్వ పంపకాలకు సరిహద్దులు చూపించడం కుదురదని, సర్వేనంబర్ల ఆధారంగా హద్దులు చెబుతామని తెలిపారు. కుటుంబంలో పెద్దకుమారుడికి భూమి మొత్తం ఇచ్చి.. ఇప్పుడు అన్నదమ్ములకు సమానంగా ఇవ్వాలని ఫిర్యాదు చేయడం సరికాదని, అలాంటివాటిని సబ్‌కలెక్టర్, సివిల్‌కోర్టులో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇలాంటివి సత్వరమే పరిష్కారం కావని పేర్కొన్నారు. ఇకపోతే జిల్లాలో సెప్టెంబర్ ఒకటి నుంచి ఇంటింటా ఓటర్ సర్వే, జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈకార్యక్రమాల్లో అధికారులు నిమగ్నం అయ్యారు. ఈ నెల 31 వరకు ఓటరు నమోదు, సవరణ చేపడతామని, సెప్టెంబర్ ఒకటి నుంచి 30 వరకు బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల బూత్‌లెవల్ నాయకుల సహాయంతో ఇంటింటా పరిశీలనకు వెళ్లాల్సి ఉంటుందని, ఇందులో స్థానికంగా ఉంటున్న వారు, ఇతర వార్డుల్లో ఉన్నవారు, చనిపోయిన, ఓటరు జాబితాల్లో తప్పిదాలను సవరిస్తామని తెలిపారు.

2020 జనవరి ఒకటివరకు 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు స్వీకరణ అక్టోబర్ 15 నుంచి 30వరకు ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా 1500 ఓటర్ల లోపు ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి జియోట్యాగింగ్ ఉంటుందని, ఆన్‌లైన్, మీసేవ, నేరుగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

# రైల్వే పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం

### అక్టోబర్ 2 నుంచి అమలు

న్యూఢిల్లీ,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): అక్టోబర్ 2 నుంచి రైల్వే స్టేషన్ల పరిసరాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలని భారతీయ రైల్వే నిర్ణయం తీసుకుంది. మొదటి దశలో ప్రయోగాత్మకంగా 360 ప్రధాన స్టేషన్లలో 18 వందల 53 ప్లాస్టిక్ వాటర్ బాటిల్ క్రషింగ్ యంత్రాలను ఏర్పాటు చేయబోతున్నది. అటు రైల్వే స్టేషన్లలో ప్లాస్టిక్ బ్యాగులను నివారించేందుకు చిరు వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. రైల్వే ఉద్యోగులు సైతం ప్లాస్టిక్ వాడకన్ని తగ్గించేందుకు పర్యావరణహితంగా ఉండే సంచులను వాడాలని కోరింది. భారీ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థల్లో భారతీయ రైల్వేస్ ముందు వరుసలో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

### శశిథరూర్‌కు హైకోర్టులో ఊరట

న్యూఢిల్లీ,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కి కోల్‌కతా హైకోర్టులో ఊరట లభించింది. వివాదాస్పద 'హిందూ పాకిస్తాన్' వ్యాఖ్యల కేసులో జారీ అయిన అరెస్టు వారెంటుపై కోల్‌కతా హైకోర్టు స్టే విధించింది. జస్టిస్ రాజశేఖర్ మెంతా నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.. సుమీద్ చౌదరి అనే లాయర్ వేసిన పిటిషన్ ఆధారంగా ఈ నెల 13న శశి థరూర్‌పై ఓ సిటీ మెట్రోపాలిటన్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గతేడాది జూలైలో తిరువనంత పురంలో జరిగిన ఓ కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ... 2019 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ వస్తే మన దేశం 'హిందూ పాకిస్తాన్' లాగా అయిపోతుందంటూ థరూర్ వ్యాఖ్యనించిన చేసిన సంగతి తెలిసిందే. మైనారిటీ హక్కులు హరించేలా బీజేపీ కొత్త రాజ్యాంగం రాస్తుందనీ... దాంతో మనదేశంకూడా పాకిస్తాన్‌లా తయారవుతుందని ఆయన పేర్కొనడంతో కాంగ్రెస్ బీజేపీల మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది.

# చిదంబరం రహస్యం ఛేదించాలి

హైదరాబాద్, ఆగష్టు 23:చిదంబరంను సిబిఐ కస్టడీకికి అప్పగించడంతో ఇప్పుడాయన నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పొరపాటే. హోంమంత్రిగా పనిచేసిన చిదంబరం ఆస్తులపై ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా పుంఖాను పుంఖాను లుగా వార్తలు వస్తున్నాయి. అందులో నిజమెంత అన్నది పక్కన పెడితో అందులో ఎంతోకొంత ఆస్తయితే చిదంబరం సొంతం అయి వుంటుంది. అదికూడా వేలకోట్లలోనే ఉంటుందని తెలుస్తోంది. ఇంతగా ఆస్తుఉలెలా కూడబెట్టారన్నది తేలాల్సి ఉంది. ప్రభుత్వానికి చిత్తశుద్ది ఉంటే ఈ నిజాలు వెలికితీయాలి. చిదంబరాన్ని అరెస్ట్‌తో కాకుండా అసలు నిజాలతో కేసును పక్కాగా చేపట్టి, అవినీతి రాజకీయ నాయకులకుదడపుట్టేలా చేయాలి. రాజకీయ నేతలు సంపాదించకుండా ఉంటారని ఎవరూ అనుకోవడం లేదు. అయితే అక్రమంగా, చట్టవ్యతిరేకంగా సంపాదించిన దానికి లెక్కలు చెప్పాల్సిందే. హోం మంత్రిగా దేశానికి దిశానిర్దేశం చేసిన ఈ మాజీ మంత్రి ఆర్థికమంత్రిగా కూడా పనిచేసినందున నిజాలు చెబితే మర్యాదగా ఉంటుంది. నిజానికి ఇలాంటి పదవుల్లో పనిచేసిన వారు అవినీతి మకిలి అంటకుండా చూసు కోవాల్సి ఉంది. కానీ చిదంబరం కేసులో కానవస్తున్న ఆధారాలు ఆయన దోషిత్వాన్ని వెల్లడించేవిగా ఉన్నాయి. ఇకపోతే యాధృచ్ఛికంగా ఢిల్లీలోని సీబీఐ కేంద్ర కార్యాలయాన్ని ఎనిమిదేండ్ల కిందట చిదంబర మే ప్రారంభించారు. ఇప్పుడదే కార్యాలయానికి నిందితుడిగా వెళ్లారు. 2011లో చిదంబరం కేంద్ర హోం మంత్రిగా జూన్ 30న సీబీఐ నూతన కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించగా, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాడు ఏపీ సింగ్ సీబీఐ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ భవనంలో వాస్తులోపం ఉన్నదని, శ్మశానం పై నిర్మించారని కొందరు అప్పట్లో దుమారం లేపారు. ఏది ఏమైనా కొత్త భవనం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు పనిచేసిన సీబీఐ చీఫ్‌లపై పలు ఆరోపణ లొచ్చాయి. ఏపీ సింగ్, ఆయన తర్వాత వచ్చిన రంజిత్ సిన్హా సీబీఐ కేసులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన అనిల్ సిన్హా.. ఆర్థిక నేరగాడు విజ టయ్ మాల్యా తప్పించుకోవడానికి సాయం చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇక అలోక్ వర్మ అవమానకర రీతిలో పదవి నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు చిదంబరం కూడా అదే కోవలో విచారణ ఎదుర్కొంటున్నారు. ప్రజాస్వామ్యంలో నేతలు అధికారం అడ్డం పెటట్ఉకుని మెక్కడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ప్రజల అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకుని కక్కుర్తి పడతే ఎప్పటికో ఓ సారి ఊచలు లెక్కపెట్టక తప్పదని గుర్తించాలి. చిదంబరం లాంటి వారు అనేకులు ఇంకా బయట వేలాదిమంది రాజకీయవేత్తలు ఉన్నారు. రాజకీయ సంకల్పంఉంటే ఇలాంటి వారిని ఊచలు లెక్కపెట్టేలా చేస్తే ప్రజలు హర్షిస్తారు. ఇకపోతే ఈ కేసులో చిదంబరం పాత్రపైనా, ఆస్తులపైనా నిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ వెనకేసుకుని వచ్చే యత్నాలుచేస్తోంది. తమ పార్టీ సీనియర్ నేత పీ చిదంబరం అరెస్ట్‌పై కాంగ్రెస్ మండిపడుతోంది.. కూతురి హత్య కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఇంద్రాణి ముఖర్జియా వాంగ్మూలం ఆధారంగా ఆయన్ను అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ ఖండించింది. సీబీఐ, ఈడీ ద్వారా ప్రభుత్వం వ్యక్తిగత కక్ష తీర్చుకుంటున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని, చట్టాన్ని ఎలా హత్య చేసిందో దేశమంతా గమనించిందని నోరు పారేసుకుంది. అధికారంలో ఉన్నవారు సీబీఐ, ఈడీ ద్వారా వ్యక్తిగత కక్ష తీర్చుకుంటున్నారు. కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరాన్ని అరెస్ట్ చేసిన తీరు దీనికి నిదర్శనం. దీని వెనక ఉన్న ఏకైక కారణం వ్యక్తిగత, రాజకీయ ప్రతీకారం అని విమర్శించారు. అయితే వీరంతా ఎంతగా నోరు పారేసుకున్నా చిదంబరం అరెస్టు జరిగిపోయింది. కాంగ్రెస్ అతిరథమహారథులంతా తమ వాదనాపటిమను అద్భుతంగా ప్రదర్శించినప్పటికీ న్యాయస్థానాల్లో ఆయనను రక్షించుకోలేక పోయారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆయన ముందస్తు బెయిల్ దరఖాస్తును ఢిల్లీ హైకోర్టు తిరస్కరిం చిందిం. హోంమంత్రిగా తాను ఘనంగా ప్రారంభించిన సీబీఐ కేంద్రకార్యాలయంలోనే చిదంబరం రాత్రంతా నిద్రలేకుండా, తిండితినకుండా గడపాల్సి రావడం ఓ విచిత్రమైన పరిణామం. హోంమంత్రిగా, ఒక న్యాయ నిపుణుడిగా ఏ చట్టం రూపకల్పనలో ఆయన పాత్ర ఉన్నదో అదే చట్టప్రకారం నిందితుడై 'ఏ క్లాసిక్ కేస్ ఆఫ్ మనీలాండరింగ్' అంటూ హైకోర్టు వ్యాఖ్యానించేలా చేశారు. నేను దేశం విడిచిపారిపోను, సాక్ష్యాలు తారు మారు చేసే స్థితిలో లేనని సీబీఐకోర్టులో వాదించిన చిదంబరం అప్పుడయినా తన విచిత్ర విన్యాసాలకు స్వస్తిచెప్పి లొంగిపోయి కేసును రుజువు చేసుకుంటానని అనివుంటే ఎంతో బాగుండేది. జరుగుతున్నదంతా వేధింపేనని వాదిస్తున్నప్పుడు నేరుగా లొంగిపోయి వుంటే గౌరవం అయినా దక్కేది. నిర్దిష్టమైన ఆధారాలు కనిపించబట్టే హైకోర్టు బెయిల్ తిరస్కరించిందని గుర్తించాలి. ఇదంతా కుట్ర అనీ, అమిత్ షా తనపై పెట్టుకున్న పాతకక్షలే ఇందుకు కారణమని చెప్పి తప్పించుకోవాలనుకున్నా ఇప్పుడు ప్రజలు నమ్మడం కష్టమే. ఎందు కంటే చిదంబరం ఆస్తుల విలువ చూస్తుంటే కళ్లు తిరిగేలా ఉంది. ఇంతగా తండ్రీ కొడుకులు కలిసి కూడబెట్టిన ఆస్తల విలువ వేలకోట్లలో ఉంటుంది. పదేళ్ళ నాటి కేసును తిరిగి తెరవడం కంటే, సవివర మైన చార్జిషీటు దాఖలు చేయడం ముఖ్యం. అవినీతిని న్యాయస్థానాల్లో రుజువుచేయడం అంతిమంగా ముఖ్యం. స్పెక్ట్రమ్ కేసులో పీకలోతున ఇరుక్కున్న రాజా లాగానే, ఈ చిదంబరం చిద్విలాసంగా బయటకు పోకుండా అధికారపక్షం నిలువరించగలదా అన్నది ప్రశ్న. కేసు నీరుగారకుండా ప్రభుత్వం ఎంతగా నిజాయితీ ప్రదర్శిస్తుందన్నది ముఖ్యం.

# జన్మతః పౌరసౌత్వంపై ట్రంప్ దృష్టి

### ఇక అలాంటి అవకాశం లేకుండా చట్టం
### త్వరలోనే దీనిపైనిర్ణయం తీసుకునే అవకాశం

వాష్టింగన్,ఆగస్ట్22 (ఆంఎన్ఎ): సంచలన నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు మరో నిర్ణయాన్ని తీసుకునే యత్నంలో ఉన్నారు. జన్మతః పౌరసత్వం రద్దు చేసే విషయం గురించి తాము తీవ్రంగా ఆలోచిస్తున్నామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. గతంలోనే ఈ ప్రతిపాదన చేశారు. తాజాగా మళ్లీ దీనిని తెరపైకి తెచ్చారు. అమెరికాలో పుట్టిన వారంతా ఇప్పటి వరకు అక్కడి పౌరులుగానే గుర్తింపు పొందారు. దీనిని రద్దుచేసే ప్రతిపాదన తెచ్చారు. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా తన ప్రచారాస్త్రాల్లో దీన్ని కూడా వాడుకున్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు గతేడాది ప్రకటించడంతో ఈ అంశం ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. తాజాగా ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ, 'జన్మతః పౌరసత్వం' రద్దు చేసే విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. దేశాలు, సరిహద్దులు దాటి మా దేశంలో బిడ్డలను కంటున్న క్రమంలో పుట్టిన వారికి అమెరికా పౌరసత్వం వస్తోంది. ఈ విషయాన్ని మేము తీవ్రంగా పరిగణిస్తున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ గెలిచిన దగ్గర నుంచి వలస విధానంలో మార్పు ల కోసం ప్రయత్నిస్తున్నారు. అమెరికా కాంగ్రెస్ ఈ మార్పులపై పెద్దగా స్పందించకపోవటంతో ఆయన తన అధ్యక్ష విచక్షణాధికారం ఉపయోగించి కార్య నిర్వాహక ఉత్తర్వుల ద్వారా నిబంధనలను కఠినతరం చేయడం ప్రారంభించారు. కొన్ని విపరీత చర్యలకూ సిద్ధపడ్డారు. అందులో భాగవే జన్మతః పౌరసత్వ హక్కు చట్టంలో మార్పులకు ప్రయత్నం జరుగుతోంది. పద్నాలుగో రాజ్యాంగ సవరణను అక్రమ వలసదారులు దుర్వినియోగపరుస్తున్నారనేది ట్రంప్ అభియోగం. గర్భిణీ స్త్రీలను అక్రమంగా అమెరికా భూభాగంలోకి తరలించి అక్కడ ప్రసవం అయ్యేలా చేస్తున్నారని, వారికి పుట్టిన బిడ్డలు అమెరికా పౌరులవుతున్నారని, ఇప్పుడు అమలులో ఉన్న వలస విధానంతో వీరి తల్లిదండ్రులూ అమెరికా పౌరులవుతున్నారన్నది ట్రంప్ వాదన. ఈ విధంగా జన్మతః పౌరసత్వ హక్కుతో అక్రమ వలసదారులు పెరిగిపోతున్నారని, చివరకు వలస ఓ హక్కుగా మారుతోందన్నది ఆయన అభియోగం. అందుకే 14వ రాజ్యాంగ సవరణ దుర్వినియోగం కాకుండా కొన్ని వివరణలతో 'కార్యనిర్వాహక ఉత్తర్వు' ఇవ్వొచ్చని చెబుతున్నారు. ఇందుకు మద్దతుగా 1898 నాటి సుప్రీంకోర్టు తీర్పును ఉదహరిస్తున్నారు. అందులో అక్రమ వలసదారుల పిల్లల గురించి ప్రస్తావించలేదని, చట్టప్రకారం వచ్చిన వలసదారుల పిల్లల గురించే వివరణ ఇచ్చారని వాదిస్తున్నారు. సభల్లో ఈ అంశాన్ని చాలా ఏళ్ళ నుంచి కొంతమంది సెనేటర్లు, చట్టసభ సభ్యులు లేవనెత్తుతూనే ఉన్నారు. ప్రస్తుతం అధ్యక్షుడే ఈ వాదనను తెరపైకి తీసుకురావడంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. దీంతో ఆయన తీసుకునే నిర్ణయం ప్రకారం అక్కడ పుట్టినంత మాత్రాన ఇక అమెరికన్పౌరులు కారు.

### లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఎమ్మార్వో

హైదరాబాద్,ఆగస్టు23 (ఆర్ఎన్ఎ): బాచుపల్లి మండల రెవెన్యూ ఆఫీసర్ యాదగిరి ఎసిబికి చిక్కాడు. లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ వ్యక్తి దగ్గర లక్ష రూపాయలు డిమాండ్ చేసిన ఈ తహసీల్దార్ ఇప్పటికే యాబై వేలు తీసుకోగా, మరో యాబైవేలు తీసుకునే క్రమంలో అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. అతని ఇంటిలో అనిశా అధికారులు సోదాలు నిర్వహించిన అనంతరం అతనిపై విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే ఇతనిపై పలు అవినీతి ఆరోపణలున్నట్లు తెలుస్తోంది.

## పరువు హత్య కేసులో పదిమంది దోషులు

### కోర్టు సంచలన నిర్ణయం

తిరువనంతపురం,ఆగస్టు23 (ఆర్ఎన్ఎ): కేరళ రాష్ట్రం కొట్టయామ్‌లో పరువు హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు ప్రకటించింది. పరువు హత్య కేసులో పది మందిని కోర్టు నిందితులుగా చేర్చింది. కెవిన్ అనే దళితుడు అగ్ర కులానికి చెందిన అమ్మాయిని ప్రేమించడంతో పాటు పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నందుకు అతడిని ఆమె కుటుంబీలకు హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నీను అనే క్యాథలిక్ అమ్మాయి దళితుడైన కెవిన్ ప్రేమించుకున్నారు. దీంతో వారు ప్రేమ వివాహం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నీనును ప్రేమ వివాహం చేసుకోవద్దని అతడిని మరిచిపోవాలని నీను తండ్రి చాకో, సోదరుడు షాను ఆమెపై దాడి చేశారు. అనంతరన కెవిన్‌ను నీను సోదరుడు, తండ్రి, బంధువులు 2018 మే 26న కిడ్నాప్ చేసి హత్య చేశారు. కెవిన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కెవిన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజుల తరువాత కెవిన్ మృతదేహం కనిపించింది. దీంతో విచారణ చేపట్టి పరువు హత్యగా తేల్చారు. ఈ పరువు హత్యలో నీను తండ్రి చాకో, సోదరుడు షాను ఎ1, ఎ2గా గుర్తించారు. వీళ్లతో పాటు ఆమె బంధువులు ఎనిమిది మందిని నిందితులుగా చేర్చింది. ఒక సంవత్సరం మూడు నెలల తరువాత ఈ కేసులో పది మంది నిందితులను కోర్టు గుర్తించి శిక్ష విధించింది. ఈ తీర్పుపై కెవిన్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిందితులకు తగిన శిక్ష పడిందని తెలిపారు.

# చేరికలతో పార్టీ బలోపేతంపై బిజెపి దృష్టి

### రానున్న మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా దూకుడు

హైదరాబాద్,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): అనూహ్యంగా బలం పెంచుకుంటున్న బీజేపీ రానున్న మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొంది. ఏ చిన్న సమస్య ఉన్నా పెద్దదిగా చేసి చూపడంతో పాటు దానిని పట్టుకుని ప్రజల్లోకి వెళుతోంది. ఇప్పుడు బిజెపిలోని ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉంటున్నారు. అధికారపార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగడంతో పాటు గట్టిగా ఎదిరిస్తున్నారు. ఇకపోతే మున్సిపల్ల ఎన్నికల్ఓల సత్తా చాటేలా ముందుకు దూకుతున్నారు. సహజంగానే పట్టణ ప్రాంతాల్లో కాస్త ఎక్కువ ప్రభావం ఉండే బీజేపీ మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉంది. పైగా ఆర్టికల్ 370 రద్దు అంశం కూడా తమకు బాగా కలిసివస్తుందనే ధీమాతో ఆ పార్టీ నేతలున్నారు. ఈ సమయంలో జిల్లాల్లో పట్టున్న నేతలు కొందరు బీజేపీలో చేరడంతో పార్టీలో జోష్ మరింత పెరిగింది. పార్టీలో చేరడంతోనే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ద్వారా తన ప్రాభవం చూపించేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. జిల్లాల్లో బీజేపీకి సగం మున్సిపాల్టీలైనా సాధించిపెట్టి, తనబలాన్ని చూపించాలనే తాపత్రేయంతో వారిలో కనిపిస్తోంది. అత్యధిక మున్సిపాల్టీలను కైవసం చేసుకొనే దిశగా దృష్టి పెట్టారు. ఇలా మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఆ దిశగా బీజేపీలో చేరికలు ఉండనున్నాయి. ఏదేమైనా అదనపు బలాలతో పటిష్టంగా మారుతున్న బీజేపీలో చేరేందుకు మున్సిపల్ ఆశావహులు సమాయత్తమవుతున్నారు. ఈ హడావిడితో జిల్లాల్లో రాజకీయ ముఖచిత్రం మారుతోంది. ఇప్పటివరకు పెద్దగా ప్రభావం చూపని బీజేపీ బలోపేతం దిశగా సాగుతోంది. కేంద్రంలో వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం, రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడంతో అనూహ్యంగా బీజేపీ పుంజుకొంటోంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆశావహుల అడుగులు కమలం వైపు పడుతున్నాయి. త్వరలో బీజేపీలో చేరికలు. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఆశావహులంతా బీజేపీ వైపు దృష్టి సారిస్తున్నారు. స్థానిక నాయకులు కూడా బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తంగా పార్టీ బలోపేతం కావడంతో పాటు పట్టు సాధించేలా పావులు కదుపుతున్నారు.

### 70వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనర్స్ దీక్షాంత్ పెరేడ్ గౌరవ వందనం స్వీకరించనున్న
### – కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

హైదరాబాద్, ఆగస్టు 23:కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా, ఆగస్టు 24, 2019న 70వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనర్ల దీక్షాంత్ పెరేడ్ లో పాల్గొని గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ రోజు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, పోలీసు అకాడెమీ డైరెక్టరు శ్రీ అభయ్ పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ బ్యాచ్ లో 92 మంది ఆఫీసర్లు శిక్షణ పొందారనీ, వీరిలో 12 మంది మహిళలు ఉన్నారనీ అన్నారు.

శిక్షణ పొందిన 11 మంది విదేశీ ఆఫీసర్లలో ఆరుగురు రాయల్ భూటాన్ పోలీస్ ఆఫీసర్లు, ఐదుగురు నేపాల్ పోలీస్ ఆఫీసర్లూ ఉన్నారని, ఆయన తెలిపారు. వీరిలో తెలంగాణ కేడర్ కు ముగ్గురు ప్రొబేషనర్లు ఎంపికయ్యారు. తెలంగాణ కేడర్ కు చెందిన శ్రీ గౌష్ ఆలమ్ కు ఉత్తమ ప్రొబేషనరుగా ఎంపికయ్యారని ఆయన తెలిపారు. మహిళలలో ఉత్తమ ప్రొబేషనరుగా రాజస్థాన్ కేడర్ కు చెందిన రిచా తోమర్ ఎంపికయ్యారు. ఉత్తమ ఆల్‌రౌండ్ ప్రొబేషనరుగా ఎంపికైన శ్రీ గౌష్ ఆలమ్ ప్రధాన మంత్రి బేటన్, హోం మంత్రి రివాల్వర్ అందుకొంటారు.

ప్రొబేషనర్లు ఎక్కువ శాతం సామాన్య కుటుంబాలకు చెందినవారనీ, ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటూ వారు ఐపిఎస్ ఆఫీసర్లుగా కఠోర శిక్షణ పూర్తి చేసుకొన్నారనీ, శ్రీ అభయ్ తెలిపారు. శిక్షణ లో 42 వారాల బేసిక్ ట్రైనింగ్, కేడర్ కు చెందిన జిల్లాలలో శిక్షణ తర్వాత అకాడెమీలో 13 వారాల శిక్షణ పొందారని, శ్రీ అభయ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో రెండు ఏనుగుల మృతి

భువనేశ్వర్,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): కెందుజహర్ జిల్లా ఘటాగాన్ వద్ద గురువారం ఉదయం ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న రెండు ఏనుగులను లారీ ఢీకొంది. దీంతో ఆ రెండు ఏనుగులు మృతి చెందాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. శవ పరీక్ష కోసం మృతి చెందిన ఏనుగులను వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు.

# గీతాసారాన్ని బోధించిన దేవదేవుడు శ్రీకృష్ణుడు



## కృష్ణాష్టమి ప్రత్యేకం

హైదరాబాద్,ఆగస్ట్23(ఆరెన్ఎ): ప్రపంచానికి గీతాసారాన్ని బోధించిన దేవదేవుడు శ్రీమహావిష్ణువు అవతారాల్లో శ్రీకృష్ణావతారం విశిష్టమైనది. ప్రేమకు,దుష్టశిక్షణ,శిష్ట రక్షణకు ఈ అవతారంలో అనేక సందర్భాలు కనిపిస్తాయి. శిష్టరక్షణ, దుష్ట శిక్షణ కోసం ధర్మం కోసం పోరాడిన పాండవులకు ఆ కరుణామూర్తి తన ఆశీస్సులను ఇచ్చాడు. ఎన్నో మాయలను ఎదుర్కొని వారిని సంరక్షించాడు. అదే పరమాత్ముని లీల. యుగావసరాలకు అన్వయించుకోదగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది. భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతుడు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచుకోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒకమార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగిపోయాడు. భారతంలోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. భాగవత కృష్ణుడు విశేష రసజ్ఞ మనోజ్ఞ మూర్తి. భారత కృష్ణుడు అసాధారణ అలౌకిక ప్రజ్ఞానిధి. కృష్ణ కథలో ఈ రెండూ విభిన్న కోణాలు. ఈ రెండు రకాల పాత్రల స్వభావాలు విభిన్నమైనవి, అదే సమయంలో సర్వసమగ్రమైనవి. ద్వాపరయుగంలో జన్మించిన పరంధాముడు అనేక విధాలుగా విశ్వానికి అవసరమైన జ్ఞానాన్ని అందించాడు. మానవాళికి ఉపయుక్తమైన భగవద్గీతను అందించి గీతాచార్యునిగా ఖ్యాతిచెందారు.

అందుకే ఆయన జగద్గురువుగా మనకు దర్శనమిస్తారు. అల్లరి చేస్తున్న శ్రీకృష్ణుడిని యశోద మాత తాడుతో చెట్లకు కట్టివేసింది. భగవంతుడిని ఎవరియినా కట్టగలారా? అన్న ప్రశ్నకు భక్తి తత్పరులు మాత్రమే చేయగలరు అన్న సమాధానం వస్తుంది. ఇది లోకం దృష్టికి నవ్యోమాహనకరంగా, అదే సమయంలో లోచూపునకు సంక్లిష్టభరితంగా కనిపించేది. గోపబాలురకు చెలికాడిగా, గోపికలకు వెన్నెల వేలుపుగా ఆటపాటలతో అలరించిన అపూర్వ ఘట్టాలను అనుశీలించేటప్పుడు మనం కూడా వారిలా మారిపోవడాన్నే కృష్ణమాయ అంటారు. రమణీయ రసానుభూతులు పంచడంతో పాటు రాక్షస సంహారం కూడా ఆయన చేశాడు. ఒక పురాణ పురుషుడి సర్వసమగ్ర వ్యక్తిత్వానికి ఇది గొప్ప ఉదాహరణ.కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశుపాల, దుర్యోధనాది స్వార్థ పరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇవన్నీ దుష్టుల చేతుల్లో ఉన్నప్పుడు సామాజిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉంటాయి. ధర్మంలేని చోట భద్రత, నీతిలేని చోట మనశ్శాంతి ఉండవు. అలాంటి రాజుల చేతుల్లోనుంచి ప్రజలను రక్షించాలి. సువ్యవస్థను స్థాపించాలి. రాజ్యం చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి ఉంది. అరాచకం, అనైక్యత పెరిగిపోయాయి. ఆ దుస్థితిని, క్లిష్టతను పారదోలేందుకు కేంద్ర రాజ్య వ్యవస్థను ఊహించిన, నిర్దేశిరచిన అద్భుత రాజనీతిజ్ఞుడు శ్రీ కృష్ణుడు.ధర్మం తప్పిన రాజులందరినీ స్వయంగానో, పాండవుల చేతనో తుదముట్టించాడు. తాను రాజ్యాధికారం కోరుకోకుండా ధార్మిక చింతనాశీలురను పాలకులుగా ఎంచి, రూపొందించి సుపరిపాలనా కేంద్ర వ్యవస్థను నిర్మించాడు. ధర్మజుని నాయకునిగా తీర్చిదిద్దిన నాయక నిర్ణేత శ్రీకృష్ణుడు. భగవద్గీత ఆవిర్భావం కూడా ఈ యుగావసరమే. అడవిలో ముక్కు మూసుకుని కూర్చున్న సర్వసంగపరిత్యాగి తన శిష్యులకు ఏకాంతంగా నూరిపోసిన ధర్మోపదేశం కాదిది.. పద్దెనిమిది అక్షౌహిణల మహాసైన్యం యుద్ధరంగంలో మోహరించి, కయ్యానికి కాలుదువ్వుతున్న ఉత్కంఠ స్థితి. తాత్కాలిక నిర్వేదానికి గురై ధర్మసంకటంలో పడిన మహాయోధుణ్ణి కార్మోన్ముఖుణ్ణి చేసేందుకు ప్రవచించిన ఉపదేశం. ఈ లోకానికంతటికీ వర్తించే ధీరవచనం. గీతాచార్యుడిగా శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం శిఖరసమానమైంది. ఆయుధాన్ని పట్టనని ప్రకటించిన శ్రీకృష్ణుడు, భీమార్జునులను ఆయుధాలుగా మలుచుకుని కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని సాగించాడు. యుద్ధాన్ని క్రతువు అన్నాడు పరమాత్మ. అది ఎప్పటికీ, సర్వమానవాళికీ అనుసరణీయం.

# కేసీఆర్‌కు స్పష్టమైన పాలసీ లేదు

**- పాలనలో శూన్యత ఏర్పడింది**

**- చెక్‌పవర్‌ని పెట్టి గ్రామీణ వ్యవస్థను కుంటుపడేలా చేస్తున్నారు**

**- బీజేపీ నేత నల్లు ఇంద్రసేనా రెడ్డి**

హైదరాబాద్,ఆగస్ట23 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పాలనా శూన్యత ఏర్పడిందని, తెలంగాణ ప్రభుత్వానికి ఏ అంశంలోనూ స్పష్టమైన పాలసీ లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనా రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పరిపాలనలో శూన్యత ఏర్పడిం దన్నారు. ప్రభుత్వం దగ్గర వ్యవసాయ ప్రణాళిక లేదు.. రైతులకు భరోసా లేదని మండి పడ్డారు. ఆఖరికి మంత్రి వర్గానికి కూడా స్వేచ్ఛలేదని.. మంత్రులు తమ తమ శాఖల్లో స్వతంత్రంగా సమీక్షలు చేసే అవకాశం లేదని ఆరోపించారు. కొత్త చట్టాల పేరుతో హడావుడి చేస్తున్నారు తప్ప వాటి వల్ల ప్రయోజనం ఏం లేదన్నారు. చెక్‌పవర్‌ని పెట్టి గ్రామీణ వ్యవస్థను కుంటుపడేలా చేస్తున్నారు.. సర్పంచులకు అధికారాలే లేవని ఆరోపించారు. రెండేళ్ల క్రితం జరిగిన కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూలోకి రిజిస్ట్రేషన్ అని చెప్పారు ప్రస్తుతం అది ఏమైందని నల్లు ఇంద్రసేనా రెడ్డి ప్రశ్నించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమని ఆ రోజు అదే చెప్పారు.. మొన్న జరిగిన కలెక్టర్ల సమావేశంలో కొత్త రెవెన్యూ చట్టం అంటూ ఈ రోజు మళ్లీ అదే చెబుతున్నారు.. పాలసీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో విద్యార్థుల అవస్థలకు లేక్కే లేదు.. నిరుద్యోగులకు ప్రభుత్వంపై నమ్మకం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని మండి పడ్డారు.

## సగటు భారతీయురాలిగా..

# ప్రియాంక చోప్రా స్పందించింది

**- ఆమెపై అనవసర వ్యాఖ్యలు చేయడం పాక్‌కు తగదు**

**- పాక్‌కు ప్రముఖ కవి జావేద్ అక్తర్ కౌంటర్**

కోల్‌కతా, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : ప్రముఖ నటి ప్రియాంకా చోప్రాను 'శాంతిదూత (పీస్ అంబాసిడర్) హోదా' నుంచి తొలగించాలంటూ ఐక్యరాజ్యసమితిని పాకిస్థాన్ కోరడంపై ప్రముఖ కవి జావేద్ అక్తర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈమేరకు గురువారం మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ఆమె ఓ సగటు భారతీయురాలిగా స్పందించారని చెప్పారు. భారతీయురాలినే అనే దృక్పథంతోనే ఆమె కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించాన్నారు. ప్రియాంక వ్యాఖ్యలు రుచించకపోతే పాక్ తమకు ఇష్టమొచ్చింది చేసుకోవచ్చని సూచించారు. తనకు ప్రియాంక వ్యక్తిగతంగా బాగా తెలుసున్నారు. ఆమె చక్కని సంస్కృతిని కలిగి ఉండటమే కాకుండా మంచి విద్యావంతురాలని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. కశ్మీర్‌లో తాజా పరిస్థితులపై మీడియా ఆయన్ను ప్రశ్నించగా.. అక్కడ ఏం జరుగుతోందో తనకు తెలియడంలేదన్నారు. ఎటువంటి సమాచారం అందుబాటులో లేకపోవడంతో వాస్తవంగా అక్కడేం జరుగుతోందో మనందరికీ తెలియడంలేదన్నారు. కశ్మీర్‌లో కర్ఫ్యూ వాతావరణం నెలకొందని.. కొన్నిచోట్ల ఆంక్షలు సైతం కొనసాగుతున్నాయని మనందరికీ తెలుసు కదా అని జావేద్ అక్తర్ అన్నారు. కశ్మీర్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ప్రియాంకా చోప్రా వంతపాడుతున్నారని.. ఆమెను శాంతిదూత హోదా నుంచి తొలగించాలని ఐరాసకు పాక్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. భారత్-పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరగాలని ఆమె ఆకాంక్షిస్తున్నారని పాక్ ఆరోపించింది.

# యూపీలో విషాద ఘటన

## డ్రైనేజీ శుభ్రం చేస్తూ ఐదుగురు మృతి

లక్నో,ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో విషాదం జరిగింది. ఓ డ్రైనేజీ కాలువను శుభ్రం చేస్తూ ఐదుగురు వ్యక్తులు మరణించిన ఘటన జిల్లాలోని నందిగ్రామ్ లో జరిగింది. గ్రామంలోని కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు అండర్ గ్రౌండ్ లో ఉన్న డ్రైనేజీని శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులు అందులోకి దిగారు. కాలువను శుభ్రం చేసే క్రమంలో అందులోని విషవాయువులను పీల్చుకొని, అపస్మారక స్థితిలో పడి విషపూరిత పొగలను పీల్చుకుని మరణించారు. కాలువలోకి దిగిన వారు ఎంతసేపయినా బయటకు రాకపోవడంతో స్థానికులు అనుమానం చెంది.. కాలువ సమీపంలోకి వెళ్లి చూడగా ఓ కార్మికుడు మరణించినట్టు గుర్తించారు. వెంటనే అతన్ని ఆ మురుగు నీటి నుంచి బయటకు తీశారు. ఈ విషయం గురించి పోలీసులకు , జిల్లా అధికారులకు సమాచారమివ్వగా వారు ఘటనాస్థలికి చేరుకొని మిగిలిన మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలన్నీ పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఏడాది జూలైలో కూడా గుజరాతలోని వడోదర జిల్లాలో ఒక హోటల్ మురుగునీటిని శుభ్రపరిచే సమయంలో నలుగురు పారిశుధ్య కార్మికులతో సహా ఏడుగురు మరణించారు. ఒక శానిటరీ కార్మికుడు సెప్టిక్ ట్యాంక్ నుండి తిరిగి రాకపోవడంతో, మరో ముగ్గురు సిబ్బంది అతనిని వెతకడానికి వెళ్ళి వారు తిరిగిరాలేదు. మరో ముగ్గురు హోటల్ సిబ్బంది కూడా వారికి సహాయం చేయడానికి లోపలికి వెళ్లి, చివరకి వారు కూడా అపస్మారక స్థితిలో పడి మరణించారు. నేషనల్ కమిషన్ ఫర్ సఫాయ్ కరంచారిస్ నివేదిక ప్రకారం 1993 నుండి 2019 జూలై 5 వరకు దేశంలో మురుగునీటిని శుభ్రపరిచే క్రమంలో 814 పారిశుధ్య కార్మికులు మరణించారని తెలిపింది. ఎక్కువ మరణాలు తమిళనాడు (206), గుజరాత్ (156) నుండి నమోదయ్యాయని ఆ నివేదిక లో తెలిపింది.

# బీజేపీలోకి దామోదర రాజనర్సింహ?

**- రాంమాధవ్‌తో భేటీ అయినట్లు ప్రచారం**

మెదక్, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీలో ఓ వెలుగు వెలిగిన దామోదర రాజనర్సింహ పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారా..? ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన దామోదర, అప్పటి నుండి పార్టీకార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీలో చేరుతారని ప్రచారం సాగుతుంది. ఇప్పటికే రామ్‌మాధవ్‌తో భేటీ అయినట్లు జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. తెలంగాణలో మెదక్ రాజకీయం చాలా భిన్నం. పొలిటికల్ లెజెండ్స్ ఖిల్లా మెదక్ జిల్లా. ఇలాంటి రాజకీయ ఉద్దండులపై గురిపెట్టింది భారతీయ జనతా పార్టీ.. మెదక్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సునీతా లక్ష్మ రెడ్డి బీజేపీలో చేరేందుకు దాదాపుగా సిద్ధమై, చివరి నిమిషంలో మనసు మార్చుకుని టీఆర్ఎస్‌లో చేరారు. ఆమె చేరిక కోసం బీజేపీ రాష్ట్ర నాయకత్వం అన్ని విధాలా కృషి చేసినప్పటికీ, ఫలితం సాధించలేకపోయారు. దీంతో మరో సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజ నర్సింహపై కాషాయ అధిష్టానం దృష్టి పెట్టిందని మెదక్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. దామోదర రాజనర్సింహ సతీమణి పద్మినికి బీజేపీ నాయకులతో, సత్సంబంధాలున్నాయి. మొన్న శాసనసభ ఎన్నికల సమయంలో, భర్తను కాదని బీజేపీలో జాయినై షాక్ ఇచ్చారు పద్మిని. ఒకవైపు తాను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటే, మరోవైపు భార్య బీజేపీలో చేరడంతో దామోదర రాజ నర్సింహ కంగుతున్నారు. ఎలాగోలా భార్యను ఒప్పించి రాత్రికి రాత్రి తిరిగి భార్యకు కాంగ్రెస్ కండువా కప్పారు. అంతటితో కుటుంబంలో రాజకీయ సంక్షోభం ముగిసినట్టయ్యింది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, దామోదర రాజనర్సింహ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మొన్నటికి మొన్న మున్సిపల్ ఎన్నికలపై సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కాంగ్రెస్ సమావేశానికి సైతం దామోదర దూరంగా ఉన్నారు. దామోదర్ రాజనర్సింహ భార్య పద్మిని సైతం ఇటీవలే బీజేపీ నేత రాం మాధవ్‌ను సైతం కలిసారట. అప్పటి నుంచి దామోదర బీజేపీలోకి వెళ్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని దామోదర ఖండించకపోవడంతో, కమలం గూటికి అన్న ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. ఇటీవలే బీజేపీ అధిష్టానం చేపట్టిన ఆపరేషన్ తెలంగాణలో భాగంగా, దామోదరను సైతం బీజేపీ ముఖ్య నేతలు కలిసారట. రాజనర్సింహ సైతం తనకు సమయం కావాలని అడిగారట. అంతా అనుకున్నట్లు జరిగితే దామోదర బీజేపీ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోందట.

# మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కండి

**ఎంపి నామా పిలుపు**

ఖమ్మం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తమ బాధ్యత గుర్తించాలన్నారు. పర్యావరణ హితం కోసం మొక్కలు తప్పనిసరని అన్నారు. ముదిగొండ మండలంలో ఒకేరోజు లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిరుమర్రి చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ.. అడవుల శాతం పెంచటం కోనం మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ముదిగొండ మండలాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర మండలాల వారూ పోటీపడి మొక్కలు నాటాలన్నారు. చిరుమర్రి చెరువు కట్టను మినీ ట్యాంకుబండ్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమల్లో మొక్కలు నాటారు. ఆయన వెంట జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సర్పంచి లక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దామోదర్, డీఆర్డీవో ఇందుమతి, ఎంపీడీవో శ్రీనివాస రావ్, ఇంఛార్జి తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# స్పెయిన్‌లో విజృంభిస్తున్న లిస్టీరియా వ్యాధి

**- ప్రపంచ దేశాలను హెచ్చరించిన స్పానిష్ ప్రభుత్వం**

**- ఇప్పటి వరకు 150మంది మృతి**

న్యూఢిల్లీ, ఆగస్ట23(ఆర్ఎన్ఎ) : ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే స్పెయిన్ లో 'లిస్టీరియా' వ్యాధి విజృంభిస్తోంది. స్పెయిన్ లో ఇప్పటివరకూ 150 మందికి ఈ వ్యాధి సోకగా, ఒకరు చనిపోయారని స్పెయిన్ ఆరోగ్య శాఖ మంత్రి మారియా లూసా తెలిపారు. ఆగస్టు 15న ఈ వ్యాధి బయటపడిందని వెల్లడించారు. దీని కారణంగా 90 ఏళ్ల వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ విషయమై అంతర్జాతీయ హెల్త్ అలర్ట్ జారీచేశామని చెప్పారు.

లిస్టీరియా వ్యాధి విషయమై యూరోపియన్ యూనియన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో)కు సమాచారం ఇచ్చామ న్నారు. 'లా మెచా' అనే బ్రాండ్ కింద విక్రయిస్తున్న సరిగ్గా ఉడకని మాంసంలో ఈ లిస్టీరియా బ్యాక్టీరియా మూలాలను గుర్తించామని మంత్రి మారియా చెప్పారు. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీని మూసివేయడంతో పాటు ఉత్పత్తులను సీజ్ చేశామన్నారు. తమ దేశంలో ఇటీవలి కాలంలో పర్యటించిన టూరిస్టులకు ఈ వ్యాధి సోకిఉండవచ్చని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. లిస్టీరియా అనే బ్యాక్టీరియా కారణంగా కొంత అస్వస్థతకు లోనవుతారు. అయితే గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారి పాలిట ఈ బ్యాక్టీరియా ప్రాణాంతకంగా మారుతుంది.

# మున్సిపల్ ఎన్నికలను అడ్డుకునే కుట్ర

**కోర్టుల్లో కేసులువేస్తోన్న విపక్ష పార్టీలు: పల్లా**

హైదరాబాద్,ఆగస్ట23 ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలు అడ్డుకోవాలని కాంగ్రెస్ ,బీజెపి పార్టీలు చూస్తున్నాయని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కోర్టుల్లో కేసులు వేసి ఎన్నికలు జరగకుండా కుట్రలు చేస్తున్నాయని అన్నారు.

గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ పల్లా మీడియాతో మాట్లాడుతూ.. కావాలనే తమ ప్రభుత్వంపై, పాలనపై కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటన్నంటిని తిప్పి కొట్టాలని పార్టీ నేతలకు కేటీఆర్ సూచించారన్నారు. ఎన్నికలు సకాలంలో రావాలని టీఆర్ఎస్ పార్టీ కోరుతుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధమేనని అన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని వైద్య సౌకర్యాలను తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తోందని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకి వైద్య సేవలు అందుతున్నాయని రాజేశ్వర్ రెడ్డి అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రజల మనసులో ఉన్న ప్రభుత్వమని ఆయన అన్నారు. ఇకపోతే టిఆర్ఎస్‌లో 60 లక్షల మంది సభ్యులుగా చేరారని ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 20 లక్షల మంది క్రియాశీల సభ్యులు ఉన్నారని, క్రియాశీల సభ్యులందరికీ పార్టీ గుర్తింపు కార్డులు ఇస్తామని వివరించారు. సభ్యత్వ నమోదులో గజ్వేల్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని, 50 లక్షల సభ్యత్వాలకు డేటా ఎంట్రీ ముగిసిందని వెల్లడించారు. గ్రామాల్లో గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఈ నెల 31 వరకు నియమించాలని నిర్ణయించామని పల్లా పేర్కొన్నారు. ఈ నెల 25 కల్లా సభ్యత్వ పుస్తకాలు పార్టీ ఆఫీస్‌కు చేరాలన్నారు. దసరాలోగా 30 జిల్లాల్లో టిఆర్ ఎన్ పార్టీ కార్యాలయాల నిర్మాణా లను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దసరా రోజున పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పట్టణ, మండల కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలు సిఎం కెసిఆర్ అమలు చేస్తున్నారని పొగిడారు. కెసిఆర్ సంక్షేమ పథకాలు మెచ్చి టిఆర్ఎస్‌కు ప్రజలు 3/4 వంతుల మెజార్టీ ఇచ్చారని పల్లా ప్రశంసించారు.

# చిదంబరం అరెస్ట్ దారుణం: స్టాలిన్

**తమిళనాట కాంగ్రెస్ నిరసనలు**

చెన్నై,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారం కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిదంబరంను బుధవారం రాత్రి సీబీఐ అధికారులు అరెస్టు చేసిన తీరుపై డిఎంకె అధినేత స్టాలిన్ మండిపడ్డారు. చిదంబరం నివాసం వద్ద సీబీఐ అధికారులు ఆయనను అరెస్టు చేసేందుకు గోడ దూకి వెళ్లడం దేశానికే సిగ్గు చేటు అని స్టాలిన్ పేర్కొన్నారు. రాజకీయ విద్వేషంతోను చిదంబరంను అరెస్టు చేశారన్నారు. ముందస్తు బెయిల్ కోరినప్పటికీ ఆయనకు బెయిల్ రాకుండా చేసి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. చిదంబరం అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని స్టాలిన్ స్పష్టం చేశారు. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం అరెస్ట్ తో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. కేంద్ర వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. చిదంబరం స్వరాష్ట్రం తమిళనాడులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసనలకు దిగారు. రాష్ట్రంలోని పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తించారు. కేంద్రం కక్ష్య సాధింపు చర్యలకు దిగుతుందని ఆరోపిస్తున్నారు.

## ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

జడ్చర్ల,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ భవనాన్ని మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ భవనం 84 లక్షలతో నిర్మితమయింది. నూతన భవనాన్ని ప్రారంభించడంతో పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేష్ కుమార్, జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రాస్, పోలీసు బృందం పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాకు సైన్స్‌ఫేర్ అవార్డు

**అభినందించిన మంత్రి ఎర్రబెల్లి**

జనగామ,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌కు అవార్డు రావడం సంతోషంగా ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌లో ఎర్రబెల్లి మాట్లాడారు. విద్యార్థినిలు చేసిన ఎగ్జిబిట్లలో వారి పట్టుదల, కృషి కనపడిందని పొగిడారు.

తెలంగాణ రాష్ట్రం రాకముందు రాష్ట్ర వ్యాప్తంగా 16 గురుకులాలు మాత్రమే ఉండేవని, రాష్ట్రం ఏర్పడిన తరువాత 246 కొత్త గురుకులాలను సిఎం కెసిఆర్ మంజూరు చేశారని కొనియాడారు. తెలంగాణ వ్యాప్తంగా 83 వేల మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదువుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి లక్షా 20 వేల రూపాయలు ఖర్చు చేస్తుందని ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. విద్యారంగానికి సిఎం కెసిఆర్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని ప్రశంసించారు.

# ప్రణయ్‌రాయ్ దంపతులపై ఇడి కేసు

న్యూఢిల్లీ,ఆగస్టు23(ఆర్ఎన్ఎ):ఎఫ్‌డీఐ కేసుల్లో సీబీఐ దూకుడు పెంచింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఎన్డీటీవీ ప్రమోటర్లు ప్రణయ్ రాయ్, ఆయన భార్య రాధికా రాయ్ తో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసింది. ఎన్డీటీవీ మాజీ సీఈవో విక్రమాదిత్య చంద్రకు కూడా నోటీసులు జారీ చేసింది.

ఆయనపై కుట్ర, మోసం, అవినీతి అభియోగాలతో కేసులు పెట్టింది. విదేశీ నిధులను మోసపూరిత మార్గంలో భారత్‌కు తెచ్చేందుకు ఎన్డీటీవీ ప్రయత్నించిందంటున్నారు సీబీఐ అధికారులు. పలు దేశాల్లో ఎన్డీటీవీ 32 అనుబంధ సంస్థలను నెలకొల్పిందంటూ అభియోగాలు మోపారు.

## ఏపీ వార్తలు

# కలెక్టరేట్ ముందు కదం తొక్కిన విద్యార్థులు

**భారీ ర్యాలీతో జన సందోహం**

**ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఆందోళన**

విజయనగరం,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): కలెక్టరేట్ వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలంటూ.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీ జన సందోహంతో నిండింది. వేలాది మంది విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ కొనసాగింది. కలెక్టరేట్ ను ముట్టడి చేసిన విద్యార్థులు.. ' జిల్లా కలెక్టర్ బయటకు రావాలి ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆందోళన స్థలానికి పోలీసులు భారీగా మోహరించారు. విద్యార్థులు మాట్లాడుతూ.. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపకార వేతనాల బకాయిలను చెల్లించాలన్నారు. సంక్షేమ గిరిజన హాస్టల్లో వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లలో విద్యార్థులు జ్వరాలతో మగ్గిపోతుంటే.. జిల్లా కలెక్టర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టరేట్ నుండి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఎంతసేపటికీ కలెక్టర్ బయటకు రాకపోవడంతో ఉద్రిక్తత తీవ్రమైంది. కలెక్టరేట్ లోనికి చొచ్చుకెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించారు. జిల్లా కలెక్టర్ మీటింగ్ లో ఉన్నారని, డిఆర్ఓని పంపించగా, విద్యార్థులు అంగీకరించలేదు. తాము ఇన్ని సమస్యలతో బాధపడుతుంటే.. ఇంత ఎండలో ధర్నా చేస్తుంటే.. తమ సమస్యలను వినే ఓపిక కూడా కలెక్టర్ కి లేదా అంటూ.. విద్యార్థులు నిలదీశారు. కలెక్టర్ తమతో మాట్లాడే వరకూ ఎంతసేపు అయిన కదిలేది లేదు అంటూ.. విద్యార్థులు రోడ్డుపై బైటాయించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడటానికి ససేమిరా అన్నారని పోలీసులు చెప్పడంతో.. విద్యార్థులు రోడ్డు పై బైటాయించి ఆందోళనను తీవ్రతరం చేశారు. విద్యార్థుల పై పోలీసుల లాఠీలు విరుచుకుపడ్డాయి. విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. బూట్ కాలుతో తన్ని లాఠీ, ఆటోల్లో బలవంతంగా ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మహిళా విద్యార్థినిలపై లాఠీలు విరుచుకుపడ్డాయి. విచక్షణారహితంగా మహిళా విద్యార్థినిలను వ్యాన్‌లలో ఎత్తిపడేశారు. మహిళా విద్యార్థినిల పై మహిళా ఎస్ఐ, మహిళా పోలీసు సిబ్బంది బూట్ కాళ్లతో తన్నారు. లాఠీఛార్జ్ చేశారు. బలవంతంగా ఆటోల్లో ఎక్కించారు. వీరిని తరలిస్తున్న లారీ కి అడ్డంగా విద్యార్థులు బైటాయించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కర్రలు పట్టుకొని విద్యార్థులను కొట్టి తరిమారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అందక, ఉపకార వేతనాలు రాక, సంక్షేమ వసతులు లేక అనారోగ్యాలతో బాధలు పడుతుంటే...వీటిని పరిష్కరించాల్సిన జిల్లా కలెక్టర్ చోద్యం చూస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. మీటింగ్ మీద ఉన్న శ్రద్ధ కనీసం విద్యార్థుల మీద లేదని దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని దౌర్భాగ్య పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లు మీద బైటాయిస్తే.. విద్యార్థులపై పోలీసులతో లాఠీ ఛార్జ్ లు చేయించి, అక్రమంగా అరెస్టులు చేయించడం ఎంతవరకు సబబు అని జిల్లా కలెక్టర్ ని ప్రశ్నించారు. అరెస్టులు, లాఠీఛార్జ్ లతో ఉద్యమాన్ని అణగదొక్కలేరని సురేష్ ఉద్ఘాటించారు. 47 మంది విద్యార్థులని పోలీసులు అరెస్ట్ చేశారు. జమి పోలీస్ స్టేషన్ కి 36 మందిని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి 11 మందిని తరలించారు.

## దుర్గగుడి అభివృద్ధికి.. శక్తివంచన లేకుండా కృషిచేస్తా

**– ఈవోగా బాధ్యతలు స్వీకరించిన సురేశ్‌బాబు**

విజయవాడ, ఆగస్టు23(ఆంఎన్ఎ) : దుర్గగుడి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆలయ ఈవో సురేశ్‌బాబు అన్నారు. విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారిగా ఎం.వి సురేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోగా సురేష్ బాబును నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆలయ వేదపండితులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం దివ్యాశీర్వచనాలు అందజేశారు. అనంతరం మహామండపం ఏడో అంతస్తులో ఉన్న ఈవో కార్యాలయంలో సురేష్ బాబు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుర్గగుడి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. త్వరలో జరగనున్న దసరా ఉత్సవాలను భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దిగ్విజయంగా నిర్వహిస్తామని తెలిపారు. సురేష్ బాబు ఇప్పటివరకు అన్నవరం దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తించారు.

# వరద నివారణ చర్యల్లో సర్కార్ విఫలం

**ముందస్తు హెచ్చరికలు బేఖాతర్: కోటంరెడ్డి**

నెల్లూరు,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): వరద నివారణా చర్యలను తీసుకోవడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి నగర అధ్యక్షులు, మాజీ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. గురువారం ఉదయం కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... జులై 25 తరువాత ఎపికి వరదలొస్తాయని కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరించినా జగన్ ప్రభుత్వం ఎందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రశ్నించారు. పోలవరం రివర్స్ టెండర్ పై పెట్టిన శ్రద్ధ వరద బాధితులను ఆదుకోవడం పై పెట్టలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఇంటి చుట్టూ వైసిపి మంత్రులు చక్కర్లు కొట్టారే తప్ప... బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. వరద బాధితులంతా కన్నీళ్ళతో కడుపు నింపుకుని బతుకుతుంటే.. సిఎం జగన్ మాత్రం విదేశీ పర్యటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతి పై దుష్ప్రచారం చేసి, రాజధానిని దొనకొండకు తరలించాలనేదే వైసిపి ఆలోచన అని అన్నారు. మంత్రి అనిల్ ఆలోచించి మాట్లాడాలి.. నారా లోకేష్ పప్పో.. నిప్పో భవిష్యత్ లో అర్థం అవుతుందని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. పోలవరం రివర్స్ టెండర్ విషయం ప్రభుత్వానికి చెంప పెట్టు..అని అన్నారు. ప్రజాస్వామ్యంపై జగన్ కు గౌరవం ఉంటే వెంటనే సిఎం పదవికి రాజీనామా చేయాలని కోరారు. హుదూద్ తుఫాన్ వచ్చి జన జీవనం అస్తవ్యస్తంగా ఉంటే ఆనాటి ముఖ్యమంత్రి మూడు రోజుల్లో సాధారణ స్థితికి తీసుకొస్తే.. ఇప్పటి సిఎం విదేశాల్లో జల్సాలు చేస్తున్నారని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఘాటు విమర్శలు చేశారు.

# రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ లోపం

**నాణ్యత లేకుండా నిర్మించారన్న సిపిఎం**

విజయనగరం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ఇంజినీరింగ్ అధికారులు లేకుండా కొట్టినవలస దబ్బగడ్డ బిటి రోడ్డు పనులు కూలీలతోనే చేపడుతున్నారని రోడ్డు పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని నాణ్యంగా నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి గంగునాయుడు, మండల కార్యదర్శి చింతల తవిట్ నాయుడులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నేతలు విలేకరులతో మాట్లాడుతూ... మక్కువ మండలం దబ్బగడ్డ పంచాయతీలో కుట్టింగి వలస నుంచి దబ్బగెడ్డ వరకు గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా బిటి రోడ్ కు 4 కిలోమీటర్లకు 188.74 లక్షల రూపాయలను అధికారులు మంజూరు చేశారని అన్నారు. ఈ పనులు స్థానిక పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంటు ద్వారా కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు పనుల పర్యవేక్షణ మండల ఇంజినీరింగు అధికారి పర్యవేక్షణలో జరగాలి ఇంజినీరింగ్ అధికారి లేకపోగా, జేఈ కాని వర్క్ ఇన్స్‌పెక్టర్ కాని లేకుండానే కేవలం కూలీ పనివాళ్ళతోనే సదరు కాంట్రాక్టర్ పనులు జరిపిస్తున్నారని ఆరోపించారు. గతంలో మట్టి పనులు సక్రమంగా చేయలేదని, కింద క్వారి బుగ్గితో వేయాల్సిన లేయర్లు సక్రమంగా వేయలేదని చెప్పారు. పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకొని తిరిగి రోడ్డును దళసరిగా వేయించాలని వారు డిమాండ్ చేశారు.

# హైకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

**– జగన్ ఇప్పటికైనా కళ్లుతెరిచి పోలవరం పనులు చేపట్టాలి**

**– మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమ**

**– రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాజధాని పనులు జరిపించాలి**

**– జగన్‌కు సూచించిన ఎంపీ గల్లా జయదేవ్**

అమరావతి, ఆగస్టు23(ఆంఎన్ఎ) : పోలవరం ప్రాజెక్టులపై హైకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఎంపీ జయదేవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. పోలవరం ప్రాజెక్టు పనులను 7శాతం నుంచి 73శాతానికి తీసుకుపోయిన ఘనత టీడీపీదేనని అన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాలని తాము తపిస్తే అవినీతి ముద్ర వేయాలని చూశారని అన్నారు. తెలుగు రాష్ట్రాలు విడిపోక ముందే పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపేందుకు చంద్ర బాబు కృషి చేశారని గుర్తుచేశారు. రివర్స్ టెండరింగ్ పై ఎవరెన్ని చెప్పినా వైసీపీ నేతలు పెడచెవిన పెట్టారని దేవినేని అన్నారు. 2009లో పోలవరం టెండర్లు రద్దయిన కారణంగానే వైకాపా ఆవిర్భావం జరిగిందన్నారు. 2019లో అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు కొట్టేయాలని చేశాం న్నారు. అందుకే వైఎస్ బంధువుతో పీటర్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. పోలవరం పై జగన్ తొందరపాటు నిర్ణయానికి న్యాయస్థానం తీర్పు చెంపపెట్టని అన్నారు. కోర్టుతీర్పుతోనయినా జగన్ కళ్లుతెరిచి త్వరితగతిన పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. అనంతరం టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. రాజధానిగా అమరావతిని వైకాపా మొదట్నుంచీ వ్యతిరేకించిందని అన్నారు. జగన్‌నోటి వెంట ఒక్కసారి కూడా అమరావతి పేరు లేదని గుర్తుచేశారు. అమరావతిపై వరదలు మానవ తప్పిదం కారణంగా ఏర్పడినవేనని అన్నారు. అమరావతిని నిర్మించకూడదన్న ఉద్దేశంతోనే మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన చేశారని విమర్శించారుని, దీని పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటన చేయాలని జయదేవ్ డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణానికి 35వేల కోట్లతో టెండర్లు పిలిచారని, 9వేల కోట్లు ఖర్చు జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం రాజధాని మారిస్తే ఆ నిధులన్నీ వృధా అయ్యే ప్రమాదం ఉందన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్‌గురించి ఆలోచిస్తే అమరావతి నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. హైటెక్ సిటీ నిర్మించాక చంద్రబాబు దిగిపోతే వైఎస్ వచ్చి ఆ నిర్మాణం ఆపలేదని, ఇది జగన్ గుర్తించాలని గెల్లా సూచించారు.

## ఆగివున్న లారీని ఢీకొట్టిన మరోలారీ

**– మంటలు వ్యాపించి డ్రైవర్, క్లీనర్ సజీవదహనం**

విజయనగరం, ఆగస్టు23 (ఆర్ఎన్ఎ) : విజయనగరం జిల్లా గజపతినగరం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగివున్న లారీని వెనుకనుంచి మరో లారీ ఢీకొనడంతో మంటలు వ్యాపించి డ్రైవర్, క్లీనర్ సజీవదహనమయ్యారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అయితే ఆగి ఉన్న లారీ కూడా అంతకుముందే ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం వేకువజామున మండలంలోని గుడివాడ గ్రామం వద్ద 26వ నెంబరు జాతీయ రహదారిపై ఆగివున్న లారీని విశాఖ నుంచి పార్వతీపురంవైపు కెమికల్ పౌడర్ లోడ్‌తో వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో కెమికల్ లారీలో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ రామచందర్‌యాదవ్ (40), క్లీనర్ ప్రకాష్ సింగ్(30) మంటల్లో సజీవదహనమయ్యారు. ఈ ఘటన కారణంగా తెల్లవారుజాము 3గంటల నుంచి 6గంటల వరకు రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని వాహన రాకపోకలను పునరుద్ధరించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్!

**– పోలవరం రివర్స్ టెండరింగ్‌పై ముందుకెళ్లొద్దని ఆదేశం**

**– ఏపీ జెన్‌కో ఇచ్చిన ఉత్తర్వులు సస్పెండ్ చేసిన హైకోర్టు**

అమరావతి, ఆగస్టు23(ఆంఎన్ఎ) : పోలవరం రివర్స్ టెండరింగ్‌లో ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాకిచ్చింది. రివర్స్ టెండరింగ్‌పై ముందుకెళ్లొద్దని ఆదేశాలిచ్చింది. పోలవరం హైడల్ ప్రాజెక్టు పనుల ఒప్పందాన్ని ఏపీజెన్‌కో రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ నవయుగ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం తీర్పును వెలువరించింది. హైడల్ ప్రాజెక్టు విషయంలో మధ్యంతర ఉత్తర్వులను వెలువరించిన హైకోర్టు.. రివర్స్ టెండరింగ్‌పై ముందుకు వెళ్లొద్దని పేర్కొంది. జల విద్యుత్ ప్రాజెక్టు పనులను ఇతరులకు అప్పగించకుండా నిలువరించాలని, తమనే కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని నవయుగ ఇంజినీరింగ్ సంస్థ హైకోర్టును అభ్యర్థించిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. హైడల్ ప్రాజెక్టు టెండర్ రద్దు విషయంలో ప్రభుత్వ వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది. రివర్స్ టెండరింగ్ విషయంలో ముందుకెళ్లరాదని స్పష్టంచేసింది. నవయుగ కాంట్రాక్టను రద్దుచేస్తూ ఏపీజెన్‌కో ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసింది. నిబంధనల ప్రకారం వేగంగా పనులు చేస్తున్న తమని తప్పించి రివర్స్ టెండరింగ్‌కు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వెళ్తోందంటూ పిటిషన్ దాఖలు చేసింది. జెన్‌కోతో ఒప్పందం చేసుకున్నప్పటి నుంచి..కాంట్రాక్ట్ విషయంలో తాము ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని నవయుగ తరపున వాదనలు వినిపించిన లాయర్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. హైడల్ ప్రాజెక్ట్ కు ఏపీ జెన్‌కో సకాలంలో స్థలం చూపించనందుకే ఆలస్యమైనందని తెలిపారు. ఎలాంటి కారణం చూపకుండా ప్రభుత్వం ప్రాజెక్ట్‌కు సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఎలా రద్దు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకూ నిబంధనలు ఉల్లంఘించలేదని.. 2021 నవంబరు వరకు తమకు కాంట్రాక్ట్ గడువు ఉందని తెలిపారు. హైడల్ ప్రాజెక్టు విషయంలో మాత్రమే కోర్టు తీర్పు వెలువరించడంతో పోలవరం హెడ్‌వర్క్‌కు ఎలాంటి సంబంధం ఉండదు. దీంతో హెడ్ వర్క్స్ విషయంలో ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌కు ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. కాగా, పోలవరం ప్రాజెక్టు సంబంధించి రివర్స్ టెండరింగ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. 2015-16 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం మొత్తం రూ.4,900 కోట్ల మేర టెండర్లను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ వెలువరించిన ప్రభుత్వం.. హెడ్‌వర్క్స్ రూ.1,800 కోట్లు, హైడల్ ప్రాజెక్టుకు రూ.3,100 కోట్ల పనులకు రివర్స్ టెండరింగ్‌ను ఆహ్వానించింది.

ఏపీ ప్రభుత్వం ఇప్పుడేం చెబుతుంది – చంద్రబాబు

పోలవరం జలవిద్యుత్తు ప్రాజెక్టు ఒప్పందం రద్దు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఏపీ ప్రతిపక్షనేత చంద్రబాబు స్పందించారు. తాజా తీర్పుపై ప్రభుత్వం ఏం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. ఇది ఇక్కడితో ఆగదని.. ఈ జాప్యం ప్రాజెక్టుపై మరింత ప్రభావం చూపుతుందని అన్నారు. అమరావతిలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పోలవరంపై ప్రయోగాలు వద్దని ఎవరెన్ని చెప్పినా వినకుండా ప్రభుత్వం మూర్ఖంగా వెళ్లిందని ఆరోపించారు. లేని అవినీతిని నిరూపించాలని చూశారన్నారు.

పోలవరం రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టుకు నష్టం వాటిల్లుతుందన్నారు. కేంద్రం చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి అర్థం కావడం లేదని విమర్శించారు. పోలవరంలో లేని అవినీతిని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టెండర్ల విషయంలో గడ్కరీ ఎన్నో సార్లు వద్దు అని చెప్పారని.. ఒక్కసారి న్యాయ వివాదం మొదలైతే ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని చంద్రబాబు అన్నారు.

# రాజధాని అమరావతిలోనే ఉంటుంది

**– ఎక్కడికి తరలించడం లేదు**

**– ఏపీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి**

అమరావతి, ఆగస్టు22(ఆర్ఎన్ఎ) : ఏపీ రాజధానిగా అమరావతే ఉంటుందని, రాజధానిని ఎక్కడికి తరలించడం లేదని ఏపీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు మండలంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాటాడారు.. అమరావతిలోనే రాజధాని కొనసాగుతుందని, అమరావతిని ఎక్కడికీ తీసుకెళ్లడం లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో అమరావతి కడితే మునుగుతుందని శివరామకృష్ణ కమిషన్ చెప్పిన మాటలనే మంత్రి బొత్స చెప్పారని, అమరావతిని మార్చుతున్నట్టు చెప్పలేదని అన్నారు. వివరణ ఇస్తున్నా టీడీపీ నేతలు రాజధానిని మార్చుతున్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. రాజధాని మార్పుపై ఇప్పటి వరకు ప్రభుత్వంలో ఎలాంటి చర్చ జరగలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అలాగే ఏపీలో తాగునీటి కోసం కొత్త ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని, సోమశిల జలాశయం నుంచి జిల్లాలోని ప్రతి గ్రామానికి తాగునీరు అంది స్తామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే సోమశిల జలాశయానికి నీటి కరవు ఉండదని అన్నారు. ఆత్మకూరు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంజీఆర్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని చెప్పారు.

తుగ్లక్ చర్యలు మానుకోవాలి: కేశినేని

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మార్పు ప్రచారంపై విజయవాడ ఎంపీ కేశినేని నాని స్పందించారు. రాజధానిని పదేపదే మార్చిన మహ్మద్‌బీన్ తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నామని, ఇప్పుడు మళ్లీ అదేపని చేసి ముఖ్యమంత్రి జగన్ మరో తుగ్లక్‌లా చరిత్రలోకి ఎక్కకూడదని భవగంతుణ్ని కోరుకుంటున్నానంటూ ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. మరోవైపు తాము ఏంచేసినా.. కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే చేస్తున్నామన్న వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భాజపా మండిపడింది. ఎన్నాళ్లు ప్రజలను మోసం చేస్తారంటూ ఆ పార్టీ నేతలు దుయ్యబట్టారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రధానిని అడ్డు పెట్టుకోవడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ హితవు పలికారు.

## అక్రమంగా తరలుతున్న ఇసుక లారీల సీజ్

శ్రీకాకుళం,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): ఇచ్ఛాపురం హైవే పై గురువారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. అక్రమంగా తరలిస్తున్న 16 ఇసుక లారీలను సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 16 ఇసుక లారీలను పోలీస్‌లు సీజ్ చేశారు. బెళ్ళుపడ టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా.. పట్టణ పోలీసులకి 7 లారీలు, కొజ్జిరియ జంక్షన్ వద్ద 9 లారీలు పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధార పత్రాలు లేకుండా ఒడిశా నుంచి ఆంధ్ర ప్రాంతం లోకి వివిధ చోట్లకు ఇసుకను రవాణా చేస్తున్న లారీలను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్ఐ చిన్నమ నాయుడు దర్యాప్తు చేపట్టారు.

# అర్ధరాత్రి రెచ్చిపోయిన ఆకతాయిలు

**పెట్రోల్‌తో వాహనాలకు నిప్పంటించిన దుండగులు**

విజయవాడ,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): బెజవాడలో అర్ధరాత్రి ఆకతాయిలు రెచ్చిపోయారు.ఇంటి బయట పార్క్ చేసిన వాహనాలకు నిప్పు పెట్టి పరారయ్యారు. శ్రీనగర్‌కాలనీలో ఇంటిముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలు, కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు సీసాలో పెట్రోల్ తసుకొచ్చి వాహనాలకు నిప్పంటించడం అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. వాహన యజమానుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే తరహాలో అజిత్‌సింగ్ నగర్‌లోనూ పోకిరీలు వాహనాలకు నిప్పంటించారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు ప్రాంతాల్లో ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో బిల్డర్ శివశంకర్ కు చెందిన కారుకు దుండగులు నిప్పుపెట్టారు. బైకుపై వచ్చిన ముగ్గురు ఆగంతకులు కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. శివశంకర్ ఫిర్యాదుతో సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సింగ్ నగర్ శివాలయం వీధిలో జరిగిన మరో సంఘటనలో రెండు బైకులు, కారుకు దుండగులు నిప్పుపెట్టారు. బైకులు రెండు పూర్తిగా తగలబడిపోగా, కారు ముందు భాగం కాలిపోయింది. పెట్రోల్ దొంగలు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిల అలజడితో స్థానికులు భయాందోళన చెందారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివరామకృష్ణ కమిటీని పట్టించుకోలేదు: బొత్స

ఏలూరు,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): శివరామకృష్ణ కమిటీ చెప్పిన విషయాలను, హెచ్చరికలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి బొత్స్ సత్యనారాయణ అన్నారు. దీంతో రాజధానికి ముంపు ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం తాడేపల్లిగూడెంలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ స్వగృహంలో కలిసి తేనేటి విందులో బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. తాడేపల్లిగూడెం పట్టణంలో డ్రైనేజీ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని మంత్రి బొత్సకు ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

# కాలనీలోకి వర్షం నీరు

**ఆందోళనకు దిగిన మహిళలు**

కడప,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లిలో కురిసిన వర్షానికి గండిరోడ్డులో ఉన్న వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ పక్కన వీధి వాసులు రేయింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా అవస్థలు పడుతున్నారు. గురువారం గండి – రాయచోటి ప్రధాన రహదారిపై కాలనీకి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. కొద్దిపాటి వర్షానికే జలమయంగా మారే వీధిలో భారీ వర్షంతో అస్తవ్యస్తంగా తమ కాలనీ తయారైందని మహిళలు వాపోయారు. పందులు, దోమలకు తోడు వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన చెందారు. పాలకులు, అధికారులు స్పందించి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు రోడ్డు పై వచ్చి నిరసన వ్యక్తం చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. రాయచోటి – గండి బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతమైన ఇమామ్ నగర్ రెండో వీధిలో మోకాళ్ల లోతు వర్షపు నీరు ప్రవహించడంతో ఇళ్లల్లోకి నీరు వచ్చిందని అక్కడి మహిళలు వాపోయారు. వర్షపు నీరు రోడ్లపైన ప్రవహించడంతో ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు రోడ్లపై రావడానికి ఇబ్బంది పడ్డినట్లు కాలనీ వాసులు చెప్పారు. ఇమామ్ నగర్ వీధిలో డ్రెయినేజీ కాలువలు సరిగా లేకపోవడం వల్ల వర్షపు నీరంతా భారీ స్థాయిలో రోడ్లపై ప్రవహించిందని అందుకే కాలనీకి చెందిన మహిళలు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో అనారోగ్యాలకు గురి అవుతున్నట్లు మహిళలు ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. తమ సమస్యను అధికార పార్టీ నాయకులు పరిష్కారించాలని కోరారు.

### అంగీకార సహజీవనాన్ని..

# అత్యాచారంగా భావించలేం

### - కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

అమరావతి, ఆగస్టు23(ఆంఎన్ఎ) : సహజీవనం అనేది ఇటీవలకాలంలో భారత్‌లో రోజురోజుకు పెరుగుతోంది. ఈ కేసులు కోర్టు మెట్లెక్కుతున్నాయి. పెళ్లి చేసుకుంటానని కలిసుండి తర్వాత.. మోసం చేశారంటూ కేసులు నమోదవుతున్నాయి. ఇటువంటి ఓ కేసు విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఓ మహిళ తన అంగీకారంతో సహజీవనంచేసి.. అతనితో శారీరక సంబంధం ఏర్పరచుకుంటే అది అత్యాచారం కిందకు రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సేల్స్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ గా పని చేస్తున్నఓ మహిళ సీఆర్పీఫ్ డిప్యూటీ కమాండెంట్‌తో సహజీవనం చేశారు. ఆరేళ్లు కలిసి ఉన్నారు. వీరిద్దరూ ఒకరి ఇళ్లలో మరొకరు నివాసం కూడా ఉన్నారు. ఆరేళ్ల తర్వాత డిప్యూటీ కమాండెంట్ మరో అమ్మాయిని పెళ్లి చేసుకోవటానికి సిద్ధం అయ్యారు. ఇద్దరి మధ్య విబేధాలొచ్చాయి. దీంతో ఆమె కోర్టుమెట్లెక్కింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి.. బలవంతంగా శారీరక సంబంధం ఏర్పరచుకు సహజీవనం చేశాడని కోర్టును ఆశ్రయించింది ఆ మహిళ. మరో అమ్మాయిని పెళ్లాడేందుకు నిశ్చితార్థం చేసుకున్నాడని స్పష్టం చేసింది. దీనిపై సుప్రీంకోర్టు బెంచ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, ఇందిరాబెనర్జీ ధర్మాసనం అత్యాచారం కేసును కొట్టివేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉంటే.. అత్యాచారం ఎలా అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది కోర్టు. ఇద్దరి అంగీకా రంతోనే కలిసి ఉన్నప్పుడు అత్యాచారం కింద రాదని స్పష్టం చేసింది.

## మెమో రైలు దిగుతుండగా సూపర్‌వైజర్‌కు తీవ్ర గాయాలు

నెల్లూరు,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): మెమో ట్రైన్ నుండి దిగుతూ ప్రమాదవశాత్తూ హెల్త్ సూపర్వైజర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నెల్లూరులో చోటు చేసుకుంది. నెల్లూరు ఎస్‌వివి కార్యక్రమంలో పాల్గొనేందుకు మెమో ట్రైన్‌లో గూడూరు నుంచి నెల్లూరుకు వస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ తిరుపాలు రైలు నుండి దిగుతుండగా, ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం నెల్లూరు నగరంలోని ఏసిఎస్ ఆర్‌జిజిహెచ్ ప్రభుత్వ వైద్యశాలలో అత్యవసర వైద్య సేవలను తిరుపాల్ అయ్యకు అందిసున్నారు. ఆర్థో విభాగం వైద్య నిపుణులు మస్తాన్ భాష పర్యవేక్షణలో చికిత్సలు కొనసాగుతున్నాయి.తిరుపాలు కు చేయి కట్ అయ్యిందని, కాలు తొడ భాగం వరకు నుజ్జు నుజ్జయిందని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ పై చికిత్సను అందిస్తున్నారు. వైద్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి రైలు ప్రమాదంలో గాయాలపాలైన విషయాన్ని తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి హుటాహుటిన చేరుకున్నారు.

# బంగారం షాపులో చోరీ

### ముగ్గురు మహిళల గుర్తింపు

శ్రీకాకుళం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): శ్రీకాకుళం జిల్లాలో ముగ్గురు మహిళలు.. బంగారు ఆభరణాలను చోరీ చేశారు. పాలకొండ పట్టణంలో ఉన్న నాయుడు జ్యువెలరీ షాపుకు గురువారం మధ్యాహ్నం ముగ్గురు మహిళలు వచ్చారు. బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించారు. మొదట ఓ మహిళకు బంగారు ఆభరణాలు చూపిస్తుండగా.. మరో మహిళ తన చీర కింద కొన్ని ఆభరణాలను దాచిపెట్టుకుంది. కాసేపటి తర్వాత ముగ్గురు మహిళలు అక్కడి నుంచి జారుకున్నారు. వారు వెళ్లిపోయిన తర్వాత నగలు మాయమైనట్లు దుకాణ యజమానులు గుర్తించారు. పోలీసుల సమక్షంలో దుకాణంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ఆ ముగ్గురు మహిళలే బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు తేలింది. బంగారం చోరీ చేసిన మహిళల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఏలూరు,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగు చూసింది. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం ఎన్.ముప్పవరం గ్రామానికి చెందిన గన్నమని శ్రీనివాసరావు (48) తనకున్న ఎకరన్నర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ.. అదనంగా మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు సాగు చేస్తున్నాడు. ఇటీవల కాలంలో వ్యవసాయం లాభసాటిగా లేక అప్పుల భారం పెరిగిపోవడంతో బుధవారం సాయంత్రం పశువుల పాక వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జరిగిన సంఘటనపై రాత్రి పొద్దుపోయాక చాగల్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మృతదేహాన్ని నిడదవోలు మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జయ విష్ణువర్ధన్ తెలిపారు.

# బస్‌టిక్కెట్‌పై జెరూసలెం ప్రకటనలు

### తిరుపతిలో బిజెపి భారీ నిరసనలు
### చర్యలు తీసుకోవాలన్న రాజాసింగ్

తిరుపతి,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): ఆర్టీసీ బస్సు టికెట్లపై అన్యమత ప్రకటనలను నిరసిస్తూ భాజపా కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తెలంగాణ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. తిరుపతిలో బస్‌టికెట్ వెనుక జెరూసలెం గురించి ప్రచారం చేయడం సరికాదన్నారు. 'ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌కు తెలుసా?' అని ప్రశ్నించారు. ఈ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని, ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం విషయంలో స్పందించినట్లే ఇక్కడ కూడా సీఎం స్పందించాలని కోరారు. అనంతరం భాజపా నేతలు తిరుపతి ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భాజపా నేత భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అన్నారు. అన్యమత ప్రచారానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుట్రలో భాగంగానే తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతోందని, బాధ్యులైన వారిని భక్తుల ముందు నిలబెట్టాలని ఆయన అన్నారు. అన్యమత ప్రచారాన్ని అడ్డుకునేలా గతంలోనూ ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇలాంటి ప్రచారాలు ఆగకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

# లైంగికదాడికి యత్నించిన పూజారి దేహశుద్ధి

విజయవాడ, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : విజయవాడ ఓ పూజారికి భక్తులు బడిత పూజ చేశారు. అసభ్యంగా ప్రవర్తించడంతో కూర్చోబెట్టి మరీ చితక్కొట్టారు. తప్పయిందని ఒప్పుకునేవరకు దేహశుద్ధి చేసి.. చివరికి పోలీసులకు అప్పగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్.. నిదానంపాటి అమ్మవారి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న కుప్పం బాలాజీ గుడికి వచ్చే మహిళా భక్తులతో అసభ్యంగా ప్రవర్తించాడు.

16 ఏళ్ల బాలిక ఇటీవల గుడికి వచ్చింది. ఆమె ఆరోగ్యం కోసం పూజలు చేయాలని పూజారిని కోరింది. అయితే పూజలు చేస్తానని చెప్పి గుడి బయట ఉన్న అతడి గదిలోకి తీసుకెళ్లాడు. గదిలోకి వెళ్లిన తరువాత అసభ్యకరంగా ప్రవర్తించి, బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించడంతో భయపడిన బాలిక, ఇంటికి పరుగు తీసి, కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేశారు. పూజారి వికృతచేష్టలపై ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళాలందరూ కలిసి పూజారికి దేహశుద్ధి చేశారు. నిత్యం వేదమంత్రోచ్చరణతో భక్తులను అశీర్వదించాల్సిన అర్చకుడు వక్రదృష్టితో చూడటంపై మండిపడ్డారు. అసభ్యంగా ప్రవర్తించిన పంతులుపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికులు ఆ పూజారికి దేశహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు పూజారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## మార్కాపురంలో విద్యార్థుల ఆందోళన

ఒంగోలు,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): ఫీజురియంబర్స్‌మెంట్ కోరుతూ ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. స్కూల్, కాలేజీ విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్పులు దాదాపు రాష్ట్రమంతటా 1200 కోట్ల రూపాయల వరకూ ఆగిపోయాయని, మార్కాపురం డివిజన్ లో సుమారు రూ.20 నుంచి 30 కోట్ల వరకు రావలసిన ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అన్ని కలెక్టరేట్ల కార్యాలయాల వద్ద, ఆర్డిఓ కార్యాలయాల వద్ద ధర్నా చేయడంలో భాగంగా.. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అన్ని కాలేజీల విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వి.భగవాన్ దాస్, పశ్చిమ ప్రకాశం ఎస్ఎఫ్ఐ కార్యదర్శి చంద్ర ల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం ఆర్డీవో ఎం.శేషి రెడ్డి కి వినతి పత్రాన్ని అందచేశారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన: జివి

గుంటూరు,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నడిచేది రాజన్న పాలన కాదని... రాక్షస పాలన నడుస్తోందని టీడీపీ నేత,జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు విమర్శించారు. గురువారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరదపై సీడబ్ల్యూసీ ముందే హెచ్చరించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రాజధానిని భ్రష్టుపట్టిస్తున్నారని.. రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. వరద ప్రాంతం అంటూ రాజధాని ప్రతిష్టను దిగజారుస్తున్నారన్నారు. రాజధానిపై సీఎం జగన్ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తుగ్లక్ నిర్ణయాలు తీసుకుంటే... రైతులతో కలిసి సీఎం ఇంటిని ముట్టడిస్తామని ఆంజనేయులు స్పష్టం చేశారు. ఇదిలావుంటే వరదలు వస్తే రాజధానిని మార్చేస్తారా జగన్ గారూ? అని మాజీ మంత్రి జవహర్ ట్విట్టర్ వేదికగా నిలదీశారు. ఢిల్లీ, మద్రాసులో చాలా సార్లు వరదలొచ్చాయని కానీ వాళ్లు రాజధానిని మార్చలేదేమని ప్రశ్నించారు. వరదలు వస్తే రాజధానిని మార్చేస్తారా జగన్ గారూ?.. ఎన్నోసార్లు ఢిల్లీలో, మద్రాసులో వరదలొచ్చాయి...మరి వాళ్లు రాజధాని మార్చలేదేం? మీకు అమరావతి మొదట్నుంచీ ఇష్టం లేదన్న నంగతి... రాష్ట్ర ప్రజలందరికీ తెలుసంటూ జవహర్ ట్వీట్ చేశారు.

# నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్య

విజయనగరం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): గంట్యాడ మండలం మదుపాడలో గ్రామం నడిబడ్డులో వ్యక్తిని కిరాతకంగా నరికి చంపిన ఘటన గురువారం వెలుగు చూసింది. మధుపాడలో నివాసముంటున్న సున్నపు ఎర్రినాయుడు తాగుబోతు. ఈయనకి భార్య చనిపోయింది. ఒక కూతురుకి పెళ్లయింది. ఇంకో కూతురు తాతగారి ఇంటి వద్ద ఉంటుంది. కొడుకు హాస్టల్‌లో చదువుకుంటున్నాడు. ముసలి తండ్రితో కలిసి మధుపాడలో సున్నపు ఎర్రినాయుడు ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఎర్రినాయుడు నిద్రపోయిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులెవరో వచ్చి కిరాతకంగా నరికి చంపారు. ఆందోళన చెందిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి గంట్యాడ పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## జన్మాష్టమి వేడుకల్లో విద్యార్థులు

కాకినాడ,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో నృత్యాలు చేసి చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థులతో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వర ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు చిన్నతనం నుండే ఆధ్యాత్మిక, దేశ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గనే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఏపీ వార్తలు

# సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్‌కు అరుదైన గౌరవం

### ప్రభుత్వ సలహాదారుగా నియమించిన ఎపి ప్రభుత్వం

అమరావతి,ఆగస్టు23 (ఆంఎన్ఎ): సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్‌కు ఏపీ ప్రభుత్వం కీలక పదవి కట్టబెటింది. జర్నలిజంలో ఆయనకున్న అపార అనుభాన్ని సీఎం జగన్ వినియోగించుకోవాలని భావించారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా అమర్‌ను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జాతీయ మీడియా, పొరుగు రాష్ట్రాలతో సంబంధాల విషయంలో సలహాదారుగా వ్యవహరించ నున్నారు. 1976లో ఈనాడు దినపత్రిక ద్వారా జర్నలిజంలోకి అమర్ అడుగుపెట్టారు. ప్రజాతంత్ర దినపత్రిక వ్యవస్థాపక సంపాదకుడిగా పనిచేశారు. ఆయన రెండుసార్లు ఉమ్మడి ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఉన్నారు. అంతేకాదు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం అమర్ సాక్షి టీవీలో కన్సల్టింగ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.అక్షర సైనికుడు , అక్షరాలను అమ్మగా , పాత్రికేయులను ప్రాణంగా భావించే ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ అధ్యక్షులు ,. సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా నియమించడంతో జర్నలిస్టుమిత్రులు నాందం వ్యక్తంచేస్తున్నారు. ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు. అమర్ దేవులపల్లి మదన్ మోహనరావు మరియు సరస్వతి దంపతులకు జన్మించారు. బి.ఏ. పూర్తిచేసిన తర్వాత జర్నలిజంలో కూడా పట్టా పొందారు.దేవులపల్లి అమర్ 1975లో ప్రజాతంత్ర పత్రికకు కరస్పాండెంట్ గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్‌గా కొంత కాలం పాటు హాయచేసి నంపాదకునిగాఎదిగారు. ఈనాడు, ఉదయం, ఆంధ్రభూమి,ఇండియన్ ఎక్స్ప్రెస్ ఆంగ్ల పత్రికలలో పనిచేశారు . ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవి కూడా అమర్ పనిచేశారు.ప్రస్తుతం అమర్ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడుగా వున్నారు. ఐజెయులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# రాజ్‌తరుణ్ మద్యం తాగి కారు నడుపలేదు: రాజారవీంద్ర



హైదరాబాద్, ఆగష్టు 23:: సినీ నటుడు రాజ్‌తరుణ్ మద్యం తాగి నడుపలేదని సినీ ఆర్టిస్టు రాజారవీంద్ర తెలిపారు. ఇప్పటికే ట్విట్టర్‌లో రాజ్‌తరుణ్ అతివేగంతో వస్తుండగా అల్కాపూర్ టౌన్‌షిప్ మలుపు వద్ద కారు కంట్రోల్ కాకపోవడంతో గోడకు ఢీకొట్టి గాయాలయ్యాయనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయానని వివరించారు. రాజ్‌తరుణ్ డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ఘటన జరిగిందన్న దానికి సంబంధించి వీడియోలు, వాయిస్ రికార్డింగ్‌లు తన దగ్గర ఉన్నాయని తెలిసి వాటిని తొలగిస్తే నగదు ఇస్తానని రాజ్‌తరుణ్ బతిమిలాడాడని కాస్ట్యూమ్ డిజైనర్ కార్తీక్ మీడియా ముందుకు వచ్చాడు. దీనిపై సినీ ఆర్టిస్టు రాజారవీంద్ర స్పందించారు. కార్తీక్ చెబుతున్నది అబద్ధమని, అది వాస్తవం కాదని కొట్టిపారేశాడు. అతను తన దగ్గర ఘటన జరిగినప్పుడు రాజ్‌తరుణ్‌కు సంబంధించి ఆధారాలు ఉన్నాయని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని రాజారవీంద్ర ఆరోపించారు.

చివరకు రూ.3లక్షలు ఇవ్వాలని, లేదంటే మీడియా ముందుకు వెళ్తానని బెదిరించాడని రాజారవీంద్ర తెలిపారు. ఈ కేసులో పోలీసు విచారణకు పూర్తిగా సహకరిస్తామని, రెండురోజుల్లో రాజ్‌తరుణ్ షూటింగ్‌కు వస్తాడని వివరించారు. రాజ్‌తరుణ్‌పై చేస్తున్న ఆరోపణలపై న్యాయ పోరాటం చేస్తామని రాజారవీంద్ర స్పష్టం చేశారు. కార్తీక్ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రాజారవీంద్ర చెప్పారు.

రాజ్‌తరుణ్ చేసిన రోడ్డు ప్రమాద ఘటనపై నార్సింగి పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు కార్తీక్ దగ్గర ఉన్న ఆడియో, వీడియోలను పరిశీలించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత కేసులో సెక్షన్‌లు కూడా మారే అవకాశం ఉండడంతో పాటు రాజ్‌తరుణ్ నుంచి సేకరించే స్టేట్‌మెంట్ కీలకంగా మారనున్నది. కాగకార్తీక్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని రాజ్‌తరుణ్ గురువారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బస్‌టిక్కెట్ల వ్యవహారంపై విచారణచేయిస్తా: మంత్రి

అమరావతి,ఆగస్టు23 (ఆంఎన్ఎ): తిరుమలలో బస్ టికెట్ వెనుక అన్యమత ప్రచారం కలకలం రేపిన ఘటన ప్రభుత్వాన్ఇన కలవరానికి గురిచేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీల నేతలు పెద్ద ఎత్తున సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ ఘటనపై మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ స్పందించారు. కొందరు కావాలని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని.. గత ప్రభుత్వ సానుభూతివరులే అన్యమత ప్రచారం చేసినట్టు తెలుస్తోందన్నారు. టికెట్లపై అన్యమత ప్రచారం చేయడంపై విచారణకు ఆదేశించామన్నారు. రవాణామంత్రితో చర్చించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి వెల్లంపల్లి స్పష్టం చేశారు.

# తడిసిమోపెడు అవుతున్న బిల్లులు

### విద్యుత్ బిల్లులు వసూళ్లకు ఒత్తిడి

హైదరాబాద్,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడంలో ప్రభుత్వ వైఫల్యం వినియోగదారుల మెడకు చుట్టుకుంది. ఏ సీజన్‌లో ఎంత విద్యుత్తు అవసరం? డిమాండ్ ఎలా పెరుగుతోంది? అన్న కోణంలో దృష్టి సారించకపోవడంతో, తడిసిమోపెడవుతున్న కొనుగోలు భారాన్ని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు వినియోగదారులపై మోపుతున్నాయి. ఇదే సమయంలో, ఆర్థికంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొనాల్సి రావడంతో ఈ కంపెనీలు పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్ళపై దృష్టి సారించడంతో పాటు–, ప్రస్తుత నెలవారీ రెవెన్యూ వంద శాతం అయ్యేలా కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి పెంచుతోంది. కడతారా ! కనెక్షన్ కట్ చేయమంటారా ? అని ట్రాన్స్‌కో సిబ్బంది వినియోగదారులపై ఒత్తి పెడుతున్నారు. దీంతో పలువురు వ్యాపారులు, గృహ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ధనికులు మాత్రం ఎగ్గొట్టే కేటగిరీలో చేరినట్లు ట్రాన్స్‌కో వర్గాలు తెలిపాయి. ప్రతినెలా ఒక్కో జిల్లాలో కనీసం లక్ష కనెక్షన్లకు సంబంధించిన బిల్లులు కట్టడం లేదని సమాచారం. మరోవైపు, మున్సిపాలిటీల విద్యుత్ బిల్లులు ట్రాన్స్‌కోకు గుదిబండగా మారాయి. పెండింగ్ బకాయిలు ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో పాటు ప్రతినెలా చెల్లించాల్సిన బిల్లుల్లో సగం మాత్రమే కడుతుండడంతో, నెల వారీ బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. వీటి వసూళ్ళ కోసం ట్రాన్స్‌కో, సంబంధిత విభాగాలపై ఒత్తిడి తెస్తోంది.

# కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి

### ఆలయ గోడకూలి నలుగురు భక్తుల మృతి

కోల్‌కతా,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణ జిల్లాలో విషాదం నెలకొంది. కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. కచువాలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. ఈ వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో.. దేవాలయం ప్రహరీ గోడ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 50 వేలు పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు మమత ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కిడ్నాపర్ నుంచి రెండేళ్ల బాలికకు విముక్తి

రంగారెడ్డి,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): శంషాబాద్‌లో కిడ్నాపైన రెండేళ్ల బాలిక కేసును పోలీసులు 12 గంటల్లోనే ఛేదించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గగన్‌పహాడ్‌లో కిడ్నాప్ నకు గురైన చిన్నారిని పోలీసులు కిడ్నాపర్ చెర నుంచి కాపాడారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. కిడ్నాపర్ బీహార్ కు చెందినవాడుగా గుర్తించిన పోలీసులు అతన్ని విచారిస్తున్నారు.

# నాలుగు రోజుల సిబిఐ కస్టడీకి చిదంబరం

### ఆదేశాలిచ్చిన ప్రత్యేక కోర్టు
### సిబిఐ ప్రశ్నలకు సమాధానం ఇవ్వని మాజీమంత్రి

న్యూఢిల్లీ,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ఐఎన్ఎక్స్ కేసులో కేంద్ర మాజీమంత్రి చిదంబరానికి మరోసారి షాక్ తగిలింది. సీబీఐ విజ్ఞప్తి మేరకు ఈ నెల 26 వరకు చిదంబరంను సీబీఐ కస్టడికి అనుమతిచ్చింది. ఐదు రోజుల పాటు చిదంబరంను సీబీఐ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రోజుకు అరగంట పాటు కుటుంబ సభ్యులు, లాయర్లను కలిసే అవకాశం కల్పించింది కోర్టు. ఐఎన్ఎక్స్ మీడియా ముడుపుల కేసులో మాజీ కేంద్రమంత్రి చిదంబరంను అదుపులోకి తీసుకున్న సీబీఐ ..ఢిల్లీ హెడ్ క్వార్టర్స్‌లో విచారిస్తోంది. ఇంద్రాణి ముఖర్జీ, ఐఎన్ఎక్స్ మీడియాతో గల లింకులపై ఆరా తీసిన సీబీఐ.. ఇంద్రాణితో ఉన్న సంబంధాలు, పీటర్ ముఖర్జీలను ఎన్నిసార్లు కలిశారంటూ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఇరువురి మధ్య ఎన్నిసార్లు డబ్బులు చేతులు మారాయన్న దానిపై ఫోకస్ చేసిన సీబీఐ అధికారులు.. ఐఎన్ఎక్స్ మీడియా సమావేశాల్లో పాల్గొన్న వ్యక్తుల గురించి చెప్పమని ప్రశ్నల వర్షం కురిపించారని సమాచారం. బ్యాంక్ ఖాతాలు, కార్తి కంపెనీల్లో పెట్టుబడులపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. అయితే సీబీఐ ప్రశ్నలకు చిదంబరం ముక్తసరిగా సమాధానమిచ్చారని, కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానమివవ్వలేదని తెలుస్తోంది. ఇకపోతేసీబీఐ అరెస్ట్ తో మాజీ కేంద్రమంత్రి చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత ధర్మాసనంలో ఆయన రెండు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐకి వ్యతిరేకంగా ఒక పిటిషన్ దాఖలు చేసిన చిదంబరం.. ఈడీకి వ్యతిరేకంగా మరో పిటిషన్ వేశారు. అయితే సీబీఐ చిదంబరంను అరెస్ట్ చేయడంతో ఓ పిటిషన్ విచారణకు రాకపోవచ్చంటున్నారు న్యాయనిపుణులు. ఈడీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ తో పాటు చిదంబరం బెయిల్ పిటిషన్ పై కూడా రేపు సుప్రీంకోర్టుతో విచారణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం

### కూరకు బదులుగా ఉప్పుతో సరి
### ఘటనపై విచారణ జరిపించిన అధికారులు

లక్నో,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): దేశంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలుచేస్తున్నా, కొన్నిచోట్ల ఇంకా నిర్లక్ష్యం వీడడం లేదు. తాజా ఆకుకూరలు, కూరగాయలతో పాటు గుడ్లు, అరటిపండ్లు పిల్లలకు తప్పనిసరిగా ఆహారంగా ఇవ్వాలి. కానీ కూరకు బదులుగా ఉప్పు పెట్టి చేతులు దులుపుకున్న సంఘటన ఉత్తరప్రదేశ్ మిర్జాపూర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో వెలుగు చూసింది. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా.. విద్యార్థులకు రొ÷-టటెలు ఇచ్చారు. ఈ రొ÷-టటెలకు కూర ఏమీ ఇవ్వకుండా ఉప్పును ఇచ్చారు. రొట్టెకు ఉప్పును అంటించుకుని విద్యార్థులు తింటున్న దృశ్యాలను అలోక్ పాండే అనే జర్నలిస్టు తన ట్విట్టర్ పేజీలో దృశ్యాలను పోస్టు చేశారు. అయితే ఒక రోజు అన్నం, ఉప్పు, మరో రోజు రొట్టె, ఉప్పు కలిపి ఆహారంగా ఇస్తున్నట్లు తేలింది. పాఠశాలకు పాలు, గుడ్లు, అరటి పండ్లు వచ్చినా కూడా అవి పిల్లల దాకా చేరవని ఓ విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. ఇలా గత సంవత్సర కాలం నుంచి జరుగుతుందన్నారు. ఈ దృశ్యాలపై ప్రభుత్వ ఉన్నతాధికారి అనురాగ్ పటేల్ స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరిపించామని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామపంచాయతీ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేశామని ఆయన తెలిపారు.

# అన్నిరంగాల్లో అభివృద్ధి కెసిఆర్ లక్ష్యం

ఖమ్మం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని అన్నిరంగాలలో సమగ్రాభివృద్ధి చెందాలంటే ఒక్క సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో అన్నింటా మించిపోతున్నదని ఆయన అన్నారు. రాష్ట్రంలో కులవృత్తులకు సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందన్నారు. స్వయంగా రైతు ముఖ్యమంత్రి కావడంతో ఇన్నాళ్లూ వ్యవసాయం దండగ అన్న రైతులకు సాగుకు సకల వసతులు కల్పించడమే కాక పెట్టుబడికి డబ్బులు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. అంతేకాక రైతు ఏ కారణం చేతనైనా మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా వారిని ఆదుకునేందుకు రైతుబీమా పథకం ప్రవేశపెట్టి బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించి ఆ కుటుంబాలకు వెలుగులు నింపుతున్నారు.

ఆహ్వానం
లేఖిని మహిళా చైతన్య సాహితీ సాంస్కృతిక సంస్థ
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త నిర్వహణలో
ప్రముఖ రచయిత్రి డా|| పరిమళాసోమేశ్వర్ రచించిన







లేడీస్ స్పెషల్
'వార్త' దినపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన నవల
ఆవిష్కరణ సభ

26 ఆగస్ట్ '2019 సోమవారం, సాయంత్రం 6:00 గం||లకు
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో.

ముఖ్య అతిథి - పుస్తకావిష్కర్త
డా|| కె.వి.రమణాచారి ఐ.ఏ.ఎస్. (రి)
ప్రభుత్వ సలహాదారు - తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్ధనమూర్తి
అధ్యక్షులు - 'శ్రీ త్యాగరాయ గానసభ'
సభాధ్యక్షులు : డా|| వాసా ప్రభావతి
'కళారత్న హంస అవార్డు' గ్రహీత, 'లేఖిని' అధ్యక్షులు
అంకితం : డా|| జి. సోమేశ్వరరావు 'రీడర్'- ప్రభుత్వ కళాశాల (రిటైర్డ్)
గౌరవ అతిథి : డా|| ఓలేటి పార్వతీశం ప్రముఖ వక్త, విమర్శకులు
ఆత్మీయ అతిథులు
ఆచార్య సి. ఆనందారామం ప్రసిద్ధ రచయిత్రి
శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి ప్రముఖ రచయిత్రి
రచయిత్రి స్పందన : డా|| పరిమళాసోమేశ్వర్
ప్రముఖ రచయిత్రి, ప్రిన్సిపాల్- ప్రభుత్వ కళాశాల (రిటైర్డ్)
ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

కీ|శే| యద్దనపూడి సులోచనారాణి - వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు
డా|| వాసా ప్రభావతి - అధ్యక్షులు
గంటి భానుమతి - ప్రధాన కార్యదర్శి
అత్తలూరి విజయలక్ష్మి - ఉపాధ్యక్షులు
సండూరి సుందరి నాగమణి - మణి వడ్లమాని - కార్యదర్శులు
ఉంగుటూరి శ్రీలక్ష్మి - కుసుమ ఉప్పలపాటి - సంయుక్త కార్యదర్శులు

శ్రీ సృష్టికం ... జయంతి ... 92473 02882

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబయి,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): బ్యాంకింగ్, ఎనర్జీ షేర్ల అమ్మకాల ఒత్తిడి ఒకవైపు, బలహీన అంతర్జాతీయ సంకేతాలు మరోవైపు వెరసి దేశీయ మార్కెట్లను భారీ నష్టాల్లోకి నెట్టేశాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 587 పాయింట్లు నష్టపోయి 36,472.93 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 177 పాయింట్ల నష్టంతో 11వేల మైలురాయిని దిగిపోయి 10,08 వద్ద స్థిరపడింది. దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం మందకొడిగా ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. సెన్సెక్స్ 127 పాయింట్ల నష్టంతో 36,899 పాయింట్ల వద్ద, 44 పాయింట్ల నష్టంతో 10,905 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. సెబీ పలు నిబంధనల్లో మార్పులు తీసుకురావడంతో మార్కెట్ జాగ్రత్త పడింది. అయితే, ఆ తర్వాత నెమ్మదిగా కోలుకున్న సూచీలు 37,087 వద్ద గరిష్ఠాన్ని తాకగా, బలహీన అంతర్జాతీయ సంకేతాలతో నష్టాలు కొనసాగాయి. ఒకనొక దశలో సెన్సెక్స్ 36,391 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకుని 36,472 పాయింట్ల వద్ద ముగిసింది. గురువారం నాటి ట్రేడింగ్‌లో బ్రిటానియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌యూఎల్ తదితర షేర్లు లాభపడగా, యస్ బ్యాంక్, వేదాంత, ఇండియాబుల్స్ హెచ్ఎఫ్‌జీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ÷నాన్స్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి.

# జంతర్‌మంతర్ వద్ద నేతల ఆందోళన

### కాశ్మీర్ నేతలను విడుదల చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. జమ్మూకశ్మీర్ లో అరెస్ట్ చేసిన నేతలను విడుదల చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడి మానవ హక్కులను పరిరక్షించాలనే డిమాండ్‌తో ధర్నా చేపట్టారు.సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శ .డి రాజా, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, కార్తి చిదంబరం, మనోజ్ ఝా, సమాజ్ వాదీ నేత రాంగోపాల్ యాదవ్ తదితరులు కూడా హాజరయ్యారు. జంతర్ మంతర్ దగ్గర జెన్‌యూ విద్యార్థి సంఘం నాయకురాలు షెహ్లా రషీద్ హాజరైంది. జమ్మూకశ్మీర్ లో నేతల అరెస్ట్ ల విషయంలోఆర్మీ, భద్రతా బలగాలపై షెహ్లా రషీద్ అభ్యంతరకర ట్వీట్లు చేశారు. ఆర్మీని అవమానించేలా ఆమె చేసిన ట్వీట్లు వివాదం రేపాయి. గతంలోనూ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో దేశాన్ని ముక్కలు చేస్తామంటూ నినాదాలు చేసినట్టు షెహ్లా రషీద్ పై ఆరోపణలున్నాయి.

# తెలంగాణలో భారీ విద్యుత్ కుంభకోణం

### విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిన కెసిఆర్
### ఒక్క మెగావాట్ కూడా ఉత్పత్తి లేదు
### సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్న లక్ష్మణ్

హైదరాబాద్,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): తెలంగాణలో విద్యుత్ సంస్థలను భ్రష్టు పట్టించిన సిఎం కెసిఆర్, మొత్తంగా విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేశారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. 24గంటల విద్యుత్ సరఫరాలో ఎన్నో లోపాలతో పాటు భారీ కుంభకోణం దాగుందన్నారు. తెలంగాణ విద్యుత్ రంగంలో భారీ కుంభకోణం జరిగిందని.. సిట్టింగ్ జడ్డితో విచారణ జరిపిస్తే పూర్తి వివరాలు బహిర్గతం అవుతాయని ఆయన అన్నారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకుంటున్న చర్యల వల్లే దేశంలోని 28 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ సాధ్యమైందని లక్ష్మణ్ అన్నారు. విద్యుత్ రంగంలో టీఆర్ఎస్ కొత్త నాటకానికి తెరలేపిందని చెప్పారు. అనాలోచిత నిర్ణయం వల్ల డిస్కంలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఏపీ కంటే తెలంగాణలో ఎక్కువ అవినీతి జరిగిందని తెలిపారు. విద్యుత్‌పై కేంద్రం స్పష్టమైన పాలసీ అమలు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా సోలార్ విద్యుదుత్పత్తిని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆయన మండిపడ్డారు. భాజపా కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ.. దక్షిణ, ఉత్తర విద్యుత్ గ్రిడ్లను అనుసంధానం చేయడం వల్లే ఈరోజు రాష్ట్రంలో తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసేందుకు అవకాశం లభించిందని చెప్పారు. అయితే ఇదంతా తన ఘనతగా కేసీఆర్ చెప్పుకోవడం సరికాదని లక్ష్మణ్ దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 70 ఏళ్లలో ఏ పార్టీ చేయలేని విధంగా మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ వెలుగులు అందించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఐదేళ్ల పాలనలో విద్యుత్ రంగానికి సంబంధించి ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని.. ఒక్క మెగావాట్ అదనంగా ఉత్పత్తి చేయలేదని లక్ష్మణ్ విమర్శించారు. ఈరోజు తెలంగాణలో 24 గంటలు నిర్విరామంగా విద్యుత్ అందించగలుగుతున్నామంటే అది కేవలం ప్రధాని మోదీ తీసుకొచ్చిన సంస్కరణల వల్లే సాధ్యమైందని చెప్పారు. జాతీయ సోలార్ విధానంలో భాగంగా చౌకగా రూ. 4.30పైసలకు సోలార్ ఇస్తానంటే రాత్రికి రాత్రే రూ.5.50పైసలకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని లక్ష్మణ్ ఆరోపించారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాటాడుతూ సీఎం కేసీఆర్ తన తప్పులను ఇతరులపైకి నెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అవినీతి పెరిగిందని కలెక్టర్ల సదస్సులో సీఎం ఒప్పుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో కేంద్ర పథకాలు తెలంగాణలో అమలు కావడంలేదన్నారు.

# ఆకట్టుకుంటున్న ఉమ్మడి జిల్లా జలపాతాలు

### సెలవుల్లో పెరుగుతున్న పర్యాటకులు

ఆదిలాబాద్,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): మొన్నటి వర్షాలతో పాటు తాజాగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దట్టమైన అడవుల్లోని కొండల మధ్య జాలువారుతున్న జలపాత దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. సెలవులు రాగానే చుట్టు పక్కలజిల్లాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చి ప్రకృతి అందాలను వీక్షిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో జలపాతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. జలపాతాల వద్ద సరైన వసతులు లేకున్నప్పటికీ పర్యాటకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పలు జలపాతాల వద్దకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం కల్పిస్తే మరింతగా అభివృద్ధి చెందే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద జలపాతంగా కుంటాల ఆకట్టుకుంటోంది. తెలంగాణ నయాగార పిలుచుకునే ఈ వాటర్‌ఫాల్స్ చూడాలని ప్రతి ఒక్కరూ వస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల వద్ద ఉంది. ఈ జలపాతం చుట్టూ దట్టమైన కుంటాల రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. ఇటీవలి వర్షాలతో కుటంఆలకు జలకళ వచ్చింది. దీంతో పర్యాటకుల తాకిడి పెరగడంతో జలపాతం అందాలను ఆస్వాదించి వెనుదిరుగుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని చింతల మాదర, గుండాల జలపాతం సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. చింతలమాదర జలపాతానికి చేరుకోవాలంటే మండల కేంద్రం నుంచి 15కిలో మీటర్ల వయా సుంగాపూర్ వరకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి మూడు కిలో మీటర్ల ముందు నుంచి నడకనే ద్వారానే వెళ్లడం సాధ్యమవుతుంది. మండలంలోని మరో జలపాతం గుండాల.ఈ జలపాతం చేరుకోవాలంటే 16కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అందులో 10కిలో మీటర్లు వయా రోంపెల్లి మీద నుంచి వాహనాల ద్వారా వెళ్లవచ్చు. మిగత ఆరు కిలో మీటర్లు దట్టమైన అడవి కొండలపై నడుచుకుంటూ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పర్యాటకులకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని గురిస్తే అభివృద్ధి చెందే అవకాశం ఉంది. వర్షాకాలంలో ప్రకృతితో పరశించిపోతున్న సుముతుల గుండం జలపాతం కుమురం భీం జిల్లా నుంచి 26కిలో మీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కలదు. జిల్లా నుంచి వాహనాలు బలంపూర్ 21కిలో మీటర్ల వరకు రోడ్డు సౌకర్యాల కలదు. మిగతా 5కిలో మీటర్ల వరకు దట్టమైన అడవి పెద్ద పెద్ద రాళ్లు మధ్యలో కాలినకతో వెళ్లాల్సి వస్తోంది.ఆసిఫాబాద్ మండలంలోని ఏకైక జలపాతానికి సంబంధిత అధికారులు రోడ్డు సౌకర్యం కల్పిస్తే ప్రకృతి ప్రేమికులతో పాటు సందర్శకులను ఇట్టే ఆకర్షిస్తోందని స్థానికులు అంటున్నారు.

# పార్టీల్లో పెరుగుతున్న మున్సిపల్ వేడి

### హైకోర్టు తీర్పుకోసం నేతల ఎదురుచూపు

కరీంనగర్,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టులో ఇంకా ఎలాంటి తీర్పు రాలేదు. ఎన్నికలు ఎప్పుడు జరిగేది స్పష్టత రాలేదు. అయినా అధికార టీఆర్ఎస్ పార్టీలో టికెట్లకు తీవ్ర పోటీ నెలకొంది. రిజర్వేషన్లు ప్రకటిస్తే ఈ పోటీ మరితం తీవ్రం కానుంది. గత ఐదేళ్ల కాలంలో మంత్రి ఈటల రాజేందర్ సహకారంతో హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ క్రమంలో తాము పదవిలో ఉన్నపుడు చేసిన అభివృద్ధి పనులు చేశామని, తమకే టికెట్ కేటాయించాలని కోరుతుండగా, పార్టీకోసం పాటుపడుతున్న సీనియర్లమైన మాకే టికెట్ ఇవ్వాలని మరికొందరు అధికారపార్టీ ముఖ్య నేతలకు వివరించి టికెట్ అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు కొత్తగా పార్టీలో చేరుతున్నవారు తమకు ఈ సారి టికెట్ కేటాయించాలని అభ్యర్థిస్తుండటంతో అధికార టీఆర్ఎస్ పార్టీలో టికెట్లకు తీవ్ర పోటీ నెలకొననుంది. టికెట్ రాకపోతే రెబల్‌గా కూడా బరిలో నిలిచేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు మున్సిపల్ ఎన్నికల వేడి ప్రధాన పార్టీల్లో గుబులు రేపుతున్నట్లు తెలుస్తోంది. టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో అభ్యర్థుల ఎంపిక ప్రధాన పార్టీల నేతలకు కత్తిమీద సాము కానుంది. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ఆయా పార్టీల నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఆయా పార్టీల్లోని ఆశావహులు ఇప్పటికే వార్డుల్లో పరోక్ష ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలలో ఆశావహులు చాలా మంది ఉండటంతో ఒక్కో వార్డు నుంచి అభ్యర్థి ఎంపిక విషయం ఆయా పార్టీల ముఖ్య నేతలకు తలనొప్పిగా మారనుంది. మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచి ఎలాగైనా గెలుపొంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కొందరు నియోజకవర్గ స్థాయి నేతలు ఉన్నారు. రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే మహిళకు రిజర్వేషన్‌లో భార్యలను పోటీలో నిలుపడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు మున్సిపోల్స్‌పై నజర్ పెట్టాయి.

# ఐదురోజుల పాటు గురుకుల క్రికెట్

### ఆటల్లోనూ రాణించాలన్న మంత్రి

వనపర్తి,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యత నివ్వాలని వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు పూర్తిగా సహకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న టీ-10 క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, అందుకనుగుణంగా అనేక గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో పాటు విద్య, క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మన గురుకుల విద్య దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. టీ-10 క్రికెట్ లీగ్‌లో క్రీడామణులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలనీ, ప్రతి మహిళా క్రికెటర్ దేశానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఫేమస్ క్రికెటర్ మిథాలీరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మొదటి మ్యాచ్ మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల జట్ల మధ్య జరగనుండగా మంత్రి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.

÷ార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ ఆర్. లోకనాథ్, ఎంపీపీ కిచారెడ్డి, ఐటీడీఏ పీఓ వెంకటయ్య,స్పోర్ట్స్ ఆఫీసర్ రమేష్‌కుమార్, రీజనల్ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఆర్డీవో చంద్రారెడ్డి, క్రికెట్ అకాడమీ కోచ్ ఆంజనేయులు, వివిధ జట్ల క్రికెటర్లు పాల్గొన్నారు.

# వర్షాలకు నిండుకుండల్లా చెరువులు

కొత్తగూడెం,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ఇటీవలి వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. చెరువులు కుంటలు ఏనిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో విస్తారంగా కురిసిన వర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో దాదాపు 8 చెరువులు మత్తడి పోస్తున్నాయి. అతలాకుతల మయ్యారు. చెరువులు,కుంటలు, చెక్‌డ్యాంలు ,ప్రాజెక్టులు నిండు కుండలను తలపిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలంలో మొర్రేడు వాగు పొంగి ప్రవహిస్తుంది.చెరువులన్నీ మత్తడి పోస్తున్నాయి. కాకర్ల దుబ్బతండా గ్రామాల మధ్య ఉన్న వాగుపై నిర్మించినలో లెవల్ చప్టా వాగు వరద ఉధృతికి కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాల్వంచ పట్టణంలోని మొర్రెడువాగు ఉధృతంగా పొంగిప్రవహిస్తున్నది. పట్టణంలోగల రాతిచెరువు, చింతలచెర్వువు, పాతపాల్వంచలోని భూపతిరావు చెరువులకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఆయా చెరువులు మత్తడి ఎత్తిపోస్తున్నాయి. రాంపురం పెద్దచెరువు, కృష్ణారాయ చెరువు, ఎర్రచెరువు, చుంచుపల్లి విద్యానగర్ కాలనీలోని చింతలచెరువులు మత్తడి పోస్తున్నాయి. పాల్వంచ రూరల్ మండలంలోని చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. కేశవాపురంలోని కుందేటితోగు చెరువు నీటితో నిండింది. రంగాపురంలోని ఎర్రచెరువు, నాగారంలోని రాముడిచెరువు, జగన్నాధపురంలోని నర్సమ్మకుంట చెరువులు అలుగు పోస్తున్నాయి. దంతెలబోరలోని రాయుడి చెరువు వరదనీటితో నిండింది. చెరువులు నిండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం: బాల్క

కరీంనగర్,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంలాంటిదని చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తర, మధ్య తెలంగాణకు 45 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని, హైదరాబాద్‌కు 40 టీఎంసీల తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు 30 శాతం, మిషన్ భగీరథకు 60 శాతం నీరు అందుతుందని చెప్పారు. అయితే.. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు కేంద్రం జాతీయ హోదా ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టుల గురించి పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రశంసిస్తుంటే.. ఇక్కడి ప్రతిపక్ష పార్టీలు మాత్రం రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పాలనలో గోదావరి జలాల మీద ఏనాడూ ఒప్పందం కుదుర్చుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ రాజనీతిజ్ఞుడిలా వ్యవహరించి ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి నీరు అందిస్తున్నారని తెలిపారు. చాలా రాష్ట్రాల్లో నదీ జలాలపై గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. కావేరి జలాల విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తిందన్నారు. పక్క రాష్ట్రాలతో ఎలాంటి పంచాయితీ లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో చెన్నూర్ నియోజకవర్గంతోపాటు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో మూడు లక్షల ఎకరాలకు సాగు నీరందించేలా సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

క్రీడలు

# పడిలేచిన భారత్

**- తొలిటెస్ట్ మ్యాచ్‌లో కుప్పకూలిన టాప్ ఆర్డర్**
**- హాఫ్ సెంచరీతో ఆదుకున్న రహానే**
**- తొలిరోజు ఆటముగిసే సమయానికి భారత్ స్కోర్ 203/6**



అంటిగ్వా,ఆగస్టు23(ఆర్ఎన్ఎ): వెస్టిండీస్‌తో ఆంటిగ్వా వేదికగా గురువారం రాత్రి ఆరంభమైన తొలి టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు పడిలేచింది. వర్షం పదే పదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో భారత మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ అజింక్య రహానె (81: 163 బంతుల్లో ) హాఫ్ సెంచరీ సాధించడంతో భారత్ జట్టు గౌరవప్రదమైన స్కోర్‌కు చేరుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి భారత్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 203/6తో నిలిచింది. క్రీజులో రిషబ్ పంత్ (20 నాటౌట్: 41 బంతుల్లో), రవీంద్ర జడేజా (3 నాటౌట్: 28 బంతుల్లో) ఉన్నారు. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్లు కీమర్ రోచ్ మూడు, గాబ్రిల్ రెండు వికెట్లు పడగొట్టారు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ జేసన్ హోల్డర్.. భారత్‌ని బ్యాటింగ్‌కి ఆహ్వానించాడు. దీంతో.. తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ జట్టుకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (5: 13 బంతుల్లో ), టెస్టు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ చతేశ్వర్ పుజారా (2: 4 బంతుల్లో)లను ఒకే ఓవర్‌లో కీమర్ రోచ్ పెవిలియన్ బాట పట్టించగా.. అనంతరం వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి (9: 12 బంతుల్లో 2లీ4) గాబ్రిల్ బౌలింగ్‌లో దొరికిపోయాడు. దీంతో.. భారత్ జట్టు 7.5 ఓవర్లు ముగిసే సమయానికి 25/3తో ఒత్తిడిలో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అజింక్య రహానె.. ఆచితూచి ఆడుతూ మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (44: 97 బంతుల్లో )తో కలిసి భారత్ జట్టుని ఆదుకున్నాడు. నాలుగో వికెట్‌కి ఈ జోడీ 68 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పగా.. జట్టు స్కోరు 93 వద్ద రాహుల్ ఔటైపోయాడు. అనంతరం వచ్చిన హనుమ విహారి (35: 56 బంతుల్లో 5లీ4) దూకుడుగా ఆడే ప్రయత్నంలో వికెట్ చేజార్చుకున్నాడు. అయినప్పటకీ.. పట్టుదలతో ఆడిన రహానె హాఫ్ సెంచరీతో భారత్ పరువు నిలిపాడు.

విహారితో విలువైన భాగస్వామ్యం..

రాహుల్ ఔట్ అయ్యాక కూడా రహానె చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. విహారితో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపిస్తూ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కాసేపు వరుణుడు ఆటంకం కలిగించినా టీ విరామం తర్వాత మళ్లీ క్రీజులోకి వచ్చిన ఈ జోడీ విండీస్ బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటూ ముందుకు సాగింది.

విహారి కూడా ఆకట్టుకునే బ్యాటింగ్ చేశాడు. కానీ 55వ ఓవర్‌లో రోచ్ బౌలింగ్‌లో అతను వికెట్‌కీపర్ పై హోప్ చేతికి చిక్కాడు. దీంతో 82 పరుగులు భాగస్వామ్యానికి తెరపడినట్లయింది. కాసేపటికే రహానె కూడా 189 పరుగుల వద్ద గాబ్రియెల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. పంత్ (20), జడేజా(3) మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్ సాగిస్తున్న దశలో వరుణుడు మళ్లీ ఆటంకం కలిగించాడు. ఫలితంగా అంపైర్లు తొలి రోజు ఆటను ముందుగానే నిలిపివేశారు.

సెంచరీ గరించి ఆలోచన లేదు - రహానే

సెంచరీ మిస్ గురించి ప్రశ్నలు వస్తాయని నేను ముందే ఊహించా. కానీ.. మ్యాచ్ ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు చేజారిన నేపథ్యంలో.. నేను ఎక్కువసేపు క్రీజులో ఉండాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలో నేను కేవలం జట్టు గురించే ఆలోచించాను తప్ప.. సెంచరీ గురించి కాదు. ఇంకా చెప్పాలంటే నేను అంత స్వార్థపరుడ్ని కూడా కాదు. ఆంటిగ్వా పిచ్‌పై 81 పరుగులు చాలా విలువైనవి. ఇప్పుడు టీమ్ 203/6తో మెరుగైన స్థితిలో ఉందని నేను భావిస్తున్నా అని రహానె వెల్లడించాడు.

## భారత పర్యటనలో సఫారీ బ్యాటింగ్ కోచ్‌గా క్లూసెనర్

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ లాన్స్ క్లూసెనర్ కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించేందుకు రెడీ అయ్యాడు. భారత పర్యటనలో సౌతాఫ్రికా టీ20 టీమ్‌కు అసిస్టెంట్ బ్యాటింగ్ కోచ్‌గా లాన్స్ క్లూసెనర్‌ను నియమిస్తూ సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. వచ్చే సెప్టెంబర్‌లో ఆతిథ్య భారత్‌తో సౌతాఫ్రికా మూడు టీ20ల సిరీస్‌లో పాల్గొనాల్సి ఉంది. మాజీ పేసర్ విన్సెంట్ బర్న్‌ను అసిస్టెంట్ బౌలింగ్ కోచ్‌గా ఎంపిక చేసింది. అసిస్టెంట్ ఫీల్డింగ్ కోచ్‌గా జస్టిన్ ఆంటోంగ్‌ను కొనసాగిస్తూ సౌతాఫ్రికా నిర్ణయం తీసుకుంది.

క్లూసెనర్ కేవలం టీ20 సిరీస్‌కు మాత్రమే బ్యాటింగ్ కోచ్‌గా ఉంటాడని అన్ని ఫార్మాట్లకు అతడు అందుబాటులో ఉండడని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు డైరెక్టర్ కోరీ వాన్‌జిల్ తెలిపారు. తన జనరేషన్‌లో క్లూసెనర్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. టెస్టుల్లో 1906 పరుగులు చేసి 80 వికెట్లు పడగొట్టాడు. వన్డేల్లో 192 వికెట్లు తీసి 3576 రన్స్ చేశాడు. సెప్టెంబర్ 15 నుంచి ఆరంభమయ్యే టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికా భారత్‌లో పర్యటించనుంది. రెండు జట్లు మూడు టెస్టుల సిరీస్‌లోనూ తలపడనున్నాయి.

# గతానికి భిన్నంగా సాగర్ నీటి వాడకం

**ముందుచూపుతో కెసిఆర్ నీటి అంచనాలు**

**ఉమ్మడిగా జలాల వినియోగంపై దృష్టి:గుత్తా**

నల్లగొండ,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం కేసీఆర్ సాగర్‌కు పైనున్న ప్రాజెక్ట్‌ల నుంచి రాబోయే వరదను అంచనా వేసి ప్రతి నీటిబొట్టును వృథా చేయకుండా రైతాంగానికి అందించే విషయమై చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగర్‌కు వరదలు వచ్చినప్పుడు కూడా రైతాంగానికి సాగునీటిని అందివ్వాలనే ఆలోచన చేయలేదన్నారు. రైతులు కూడా ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకొని, ఆరుతడుల ద్వారా అధిక దిగుబడులు సాధించే పరిజ్ఞానాన్ని అనుసరించాలని సూచించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రతి నీటి చుక్కను వినియోగించుకోవడం ద్వారా కోటి ఎకరాల మాగాణ సాధించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్ట్‌ల పూర్తికి కృషి చేస్తున్నారని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల నుంచి మనకు రావాల్సిన వాటాలో ప్రతి నీటిచుక్కను వినియోగించడంతో పాటు వృథా కాకుండా మళ్లించడంపై దృష్టి సారించారన్నారు. ఆయన ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. సాగర్ నిండి గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి రాకముందే వచ్చిన నీళ్లను ఏట్లా సద్వినియోగం చేసుకోవాలనే విషయమై ఒక శాస్త్రీయమైన పద్ధతిలో మన ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ప్రతి నీటి బోట్టును వృథా చేయకుండా వాడుకోవాలనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సాగునీటి శాఖ మంత్రులు ఇప్పటికే రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. 50 ఏళ్లుగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ పైభాగాన ఉన్న ప్రాంత రైతులు ప్రాజెక్టులో నీటిని చూసి మురిసి పోవాల్సిందే కానీ తమ భూములకు సాగునీటికి నోచుకోలేని దుస్థితిలో ఉండిపోయారన్నారు. కానీ తెలంగాణ ఏర్పడ్డాక కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే అత్యంత వేగంగా వరదకాలువ పంపుహౌజ్ పనులను పూర్తి చేసి లోలెవల్ కాలువ ద్వారా ఆయా భూములకు సాగునీరందిస్తున్నట్లు తెలిపారు. ఈ కాలువ ద్వారా జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగునీరందుతుందని పేర్కొన్నారు.

## రూపాయికే మధ్యాహ్న భోజనం

**నోయిడాలో స్వచ్ఛందసంస్థ ఉదారత**

న్యూఢిల్లీ,ఆగస్టు23 (ఆర్ఎన్ఎ): దేశరాజధాని ఢిల్లీకి ఆనుకొనివున్న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఒక స్వచ్ఛంద సంస్థ కేవలం రూపాయికే కడుపునిండా భోజనం అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. నోయిడాలోని సెక్టార్-55 ఎ బ్లాక్‌లో ఈ పథకాన్ని చిత్రగుప్తా ట్రస్ట్, శ్రీ నారాయణ్ సాంస్కృతిక చేతన న్యాస్ సంస్థలు సంయుక్తంగా ప్రారంభించాయి. దేశంలోనే ఇంత తక్కువ ధరకు ఆహారాన్ని తాము తొలిసారిగా అందిస్తున్న మని నిర్వాహకులు చెబుతున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నుంచి మొదల య్యే ఈ పథకం ఆదివారం మినహా మిగిలిన అన్నిరోజులూ కొనసాగుతుంది. మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకూ ఇక్కడకు వచ్చే వినియోగదారులకు రూపాయికే పెరుగన్నం లేదా పప్పన్నం అందించనున్నారు. భవిష్యత్‌లో కూర, స్వీటు అందించేందుకు కూడా ప్రయత్నా లు జరుగుతున్నాయి. ఇదేవిధంగా రూపాయికే ఉదయం, సాయంత్రం వేళ్లలో టిఫిన్ అందించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# గతితప్పుతున్న ర్యాగింగ భూతం

**యూపి ఘటనను మించి ఒడిషాలో మరో ఘటన**

**విద్యార్థులతో అర్ధనగ్నంగా నృత్యం చేయించిన సీనియర్లు**

భువనేశ్వర్,ఆగస్టు23 (ఆర్ఎన్ఎ): విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టడానికి దశాబ్ద కాలం క్రితమే కఠిన చట్టాలు ప్రవేశపెట్టినప్పటికీ ర్యాగింగ్ ఘటనలు ఆగడం లేదు. రెండు రోజుల క్రితం ఉత్తర్ ప్రదేశ్‌లో 150 మంది వైద్యవిద్యార్థులు ర్యాగింగ్ బారిన పడిన విషయం తెలిసిందే. వారికిగుండ్లు కొట్టించిన ఘటన మరవక ముందే ఒడిషాలో మరో ఘటన వెలుగు చూసింది. మొదటి, రెండో సంవత్సర విద్యార్థులకు వెల్‌కమ్ పార్టీ ఏర్పాటు చేసి సీనియర్లు వారిని అవమానించేలా అర్ధనగ్నంగా డ్యాన్స్ ఏయించారు. ఒడిశాలోని వీర్ సురేంద్ర సాయి టెక్నాలజీ యూనివర్సిటీ(వీఎస్ఎస్‌యూటీ)లో ఈ దారుణం చోటు చేసుకుంది.

గత కొన్నేళ్లుగా వివాదాలకు అడ్డాగా నిలుస్తున్న ఈ యూనివర్సిటీలో తాజాగా జరిగిన ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. విశ్వవిద్యాలయంలో కొత్తగా చేరిన విద్యార్థులకు, రెండో సంవత్సరం విద్యార్థులకు ర్యాగింగ్ రుచి చూపించారు.

వెల్‌కమ్ పార్టీ పేరుతో సీనియర్లు ఓ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసి జూనియర్ల చెంపలు వాయించారు. అనంతరం వారి దుస్తులు విప్పించి అర్ధనగ్నంగా స్టేజి మీద డ్యాన్సులు వేయించారు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి విపరీతంగా వైరల్ అయ్యాయి. ఈ విషయం కాస్తా ఆ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యా శాఖ మంత్రి దృష్టికి వెళ్లడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తక్షణం విచారణ జరిపించాలని ఆదేశించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన 52 మందిని కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. వారికి రూ.2,000 జరిమానా కూడా విధించారు.

ఈ విశ్వవిద్యాలయంలో ఇలాంటి తరహా ఘటనలు జరగడం కొత్తేం కాదు. కొంతకాలం కిందట కూడా ఇలాంటి ఘటనే జరగడంతో 15మందికి భారీగా జరిమానాలు విధించి ఏడాది పాటు కాలేజి నుంచి సస్పెండ్ చేశారు.

# పాఠశాల బాలికలకు సర్కార్ భరోసా

**హెల్త్ కిట్ల పంపిణీకి ఎదురుచూపు**

హైదరాబాద్,ఆగస్ట్23 (ఆర్ఎన్ఎ): ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇప్పటికే బాలింతకు కెసిఆర్ కిట్ ఎంతగానో దోహదపడుతోంది. గర్భిణులకు భరోసా కల్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు, కళాశాలల్లో అమ్మాయిలకు కూడా ఆరోగ్య కిట్‌ను అందించేందుకు ముందుకు వచ్చింది. దేశంలోనే ఇదే ప్రప్రథమ రాష్ట్రంగా నిలిచింది. గతేడాది ప్రారంభించిన ఈ పథకంమళ్లీ వెనకడుగు వేసింది. అమ్మాయిలకు అందాల్సిన కిట్లు ఇప్పుడు అందడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నేటి బాలలే.. రేపటి భావిభారత పౌరులని భావించిన సీఎం కేసీఆర్.. విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు అనేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా బాలికలు, గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల కోసం ఆరోగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. 12 ఏళ్ల 18 ఏళ్లలోపు బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే బాలికలకు హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు.. ఆరోగ్యరక్షర్యంలో ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయంమేరకు ఆనాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వివిధ రాష్ట్రాల్లో పర్యటించి రుతుస్రావం కారణంగా విద్యార్థినులు ఆరోగ్యపరంగా బలహీన పడుతున్నారని గుర్తించారు. ఆ సమయంలో పాఠశాలలకు రాకపోవడంతో విద్యలో వెనకబడుతున్నారని గుర్తించారు. ఈ మేరకు రాష్ట్రంలో బాలికలకు హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లు ఇవ్వాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే 13 రకాల వస్తువులతో కూడిన కిట్లను గతేడాది నుంచే పంపిణీ చేసేందుకు సంబంధిత విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ పథకం కారణంగా వేలాదిమంది బాలికలకు లబ్ధి చేకూరనుంది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే క్రమం తప్పకుండా పాఠశాలలు, కళాశాలలకు వచ్చి ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలు, గురుకులాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. సన్నబియ్యంతో పౌష్టికాహారం అందించడంతోపాటు బాలికల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందల తో ఆడపిల్లలు చదువు మానేయొద్దని కేజీబీవీల్లో ఇంటర్ విద్యను కూడా అమలు చేస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, బాలికల వసతి గృహాలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదివే 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు ఈ పథకం ద్వారా హెల్త్ అండ్ హైజెనిక్ కిట్లు ఇవ్వనున్నారు. సంబంధిత కిట్లులో 16 రకాల నాణ్యమైన వస్తువులు సమకూర్చారు. రూ. 400 విలువ చేసే 13 రకాల బ్రాండెండ్ వస్తువులతో కూడిన కిట్లను మూడు నెలలకోసారి ఏడాదిలో నాలుగుసార్లు ఇవ్వనున్నట్లు అప్పట్లో ప్రకటించారు. అంటే నాలుగుసార్లకు ఒక్కో బాలికకు రూ. 1600 విలువ చేసే కిట్లు అందనున్నాయి. దీంతో బాలికలకు అవగాహన కూడా కల్పిస్తారు. అయితే ఆరంభంలో ఉన్న శ్రద్ధ తరవాత కానరావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

# ప్రకృతి విధ్వంసమే వరదలకు కారణం

**ప్రభుత్వాలు గుణపాఠం నేర్చుకోవాలి**

**లేకుంటే మరిన్ని విలయాలు చూడక తప్పదు**

**పర్యావరణవేత్తల హెచ్చరిక**

హైదరాబాద్,ఆగస్ట్23 (ఆంఎన్ఎ): కేరళ రాష్ట్రంతో పాటు దేశంలో వివిధ ప్రాంతాలు వరద కోరల్లో చిక్కుకొని విలవిల్లాడడం హృదయ విదారకం అయితే ఇదంతా ప్రకృతికి విరుద్ధంగా సాగిన హవనం అని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో ఉత్తరాదిలో తాజాగా, హిమాచల్, కేరళలో వరద బీభత్సం అంతా పర్యావరణ విధ్వంసం వల్ల కలిగిన అనుభవమని అన్నారు. ఎడాపెడా చెట్లను నరకడం,కొండలను విధ్వంసం చేయడం దీనికి కారణమన్నారు. సహజ సిద్దమైన కొండలను నాశనరం చేయడం వల్ల వచ్చిన విపరీత పరిణామమన్నారు. అయితే కేరళ విషాదం చేసే హెచ్చరిక ఒకటుందని, అదేమిటంటే, ఇది కేవలం ప్రకృతి వైపరీత్యం కాదన్నారు.

మానవ తప్పి దం వల్ల తీవ్రత పెరిగిన విలయం ఒగా చూడాలన్నారు.

పశ్చిమ కనుమల్లో ఎలాంటి గనుల తవ్వకాలు, అడవుల నరికివేత తరహా ప్రకృతి విధ్వంస కార్యక్రమాలు చేపట్టరాదంటూగతంలో గాడ్గిల్ కమిటీ ఒక నివేదిక సమర్పించింది. ఆ మాట పెడచెవిన పెట్టి పర్యావరణాన్ని ధ్వంసం చేసిన ఫలితమే ఇప్పుడు ఇంత స్థాయి వరద భీభత్సానికి కారణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ రక్షణని తేలిగ్గా తీసుకుంటున్నాయి. పరిశ్రమల పేరుతో, నగరాల పేరుతో భూమిని, గనుల పేరుతో అడవుల్ని దుంపనాశనం చెయ్యడానికి అంగీకారం తెలుపుతున్నాయి. ఇకనైనా ఆ ధోరణికి అడ్డుకట్ట పడాలి. లేదంటే కరువులోక వైపు, వరదలోక వైపు దేశాన్ని ముంచెత్తకమానవు. కేరళలో ఎడతెరిపి లేని వర్షాలు గత వంద సంవత్సరాల్లో లేనంతగా కురిసి దాదాపు రాష్ట్రమంతా మునిగి లక్షలాది ప్రజలు సహాయక శిబిరాల్లో చేరడం, వందలాది మరణించడం అత్యంత దురదృష్టకరం. ప్రకృతి విరుద్ధంగా చేస్తున్న విధ్వంసాన్ని ఆపాలన్నారు. వరద నీరు తగ్గేవరకూ మంచినీటి సమస్య, ఆహార సమస్య, కాలుష్య సమస్య, ఆపై వ్యాధుల సమస్యలు పీడిస్తాయి. వీటిపై అప్రమత్తంగా, సమర్థవంతంగా వ్యవహరిస్తూ పెద్ద పోరాటమే చెయ్యాలన్నారు.

# ధోవల్ అధ్యక్షతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఎంపిక కమిటీ

**కేంద్ర సర్కార్ కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ,ఆగస్టు23 (ఆంఎన్ఎ): జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు కేంద్రం మరో కీలక బాధ్యత అప్పజెప్పింది. చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ పదవిని అర్హులైన వారిని ఎంపిక చేయడంతో పాటు, ఆ పదవికి తగిన నిబంధనలను కూడా రూపొందించడానికి ఆయన అధ్యక్షతన ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఏయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బి.ఎస్. ధనోవా సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయనున్నాను. అయితే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ పోస్టు ప్రస్తుతం ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బిపిన్ రావత్‌ను వరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సిఫార్సుల ప్రకారం సీడీఎస్ 64 ఏళ్లకు పదవీ విం^మణ కావాల్సి ఉంటుంది. అయితే భద్రతా వ్యవహారాల కమిటీ సూచించిన సూచనలను అమలు చేయాలని రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పటికే అజిత్ దోవల్‌కి ఓ లేఖను కూడా రాసింది. అయితే ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దోవల్, అక్కడి నుంచి ఫ్రాన్స్‌కు వెళ్లనున్నారు. ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు కనుక, అక్కడ మోదీతో కలిసి ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. ఫ్రాన్స్ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాతే దోవల్ దీనిపై కసరత్తు చేయనున్నారని సమాచారం.

# త్రిపుల్ తలాక్ చట్టం చెల్లుబాటును పరిశీలిస్తాం

**- స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం**
**- కేంద్రానికి నోటీసులు జారీ**

న్యూఢిల్లీ, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : ముమ్మారు తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రామాణికతను పరిశీలిస్తామని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ముస్లిం మహిళల(వివాహ హక్కుల పరిరక్షణ) చట్టం 2019 రాజ్యాంగవిరుద్ధంగా ఉందని, రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తలాక్‌ను శిక్షార్హమైన నేరంగా పరిగణించే అంశాన్ని న్యాయస్థానం పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అంతేగాక.. కొత్త చట్టం ప్రామాణికతను పరిశీలిస్తామని పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్‌కు తెలిపింది. ముమ్మారు తలాక్ విధానం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2017లోనే తీర్పునిచ్చినా, ఇంకా అది కొనసాగుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి ఈ చట్టం విషయంలో ముందడుగు వేసింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జులైలో జరిగిన బ్జడెట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఎన్నో నాటకీయ పరిణామాల నడుమ ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి కూడా ఆమోదముద్ర వేయడంతో చట్టం అమల్లోకి వచ్చింది.

సినిమా

# సెప్టెంబర్ 6న 'తారామణి' రిలీజ్




అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో రామ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'తారామణి'. ఈ చిత్రాన్ని జె.ఎస్.కె. ఫిలిం కార్పొరేషన్ సమర్పణలో డి.వి. సినీ క్రియేషన్స్, లక్ష్మి వెంకటేశ్వర ఫ్రేమ్స్ పతాకంపై ఉదయ్ హర్ష వడ్డేల్ల, డి.వి. వెంకటేష్ తెలుగులో విడుదల చేయబోతున్నారు. సెప్టెంబరు 6న విడుదల కానున్న ఈ సినిమా గురించి నిర్మాతలు మాట్లాడుతూ? 'ఇదొక ముక్కోణపు ప్రేమకథా చిత్రం. ఇందులో భావోద్వేగాలతో పాటు అన్ని అంశాలు సమపాళ్లలో ఉంటాయి. ప్రతి సన్నివేశం మనసును హత్తుకునేలా ఉంటుంది. ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో కథ సాగుతుంది. నేటి యువత టెక్నాలజీ మాయలో పడి ఎలా ప్రవర్తిస్తున్నారు? ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు? ఫలితంగా ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు? అనే అంశాలు సినిమాలో ఉంటాయి. హీరోలు కమల్‌హాసన్, రజనీకాంత్‌గార్లు విడుదల చేసిన ట్రైలర్, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది' అన్నారు.

## విక్రమ్ ఫ్యామిలీ నుండి మరో హీరో

ఇటు తెలుగు, అటు తమిళ భాషలలో తన నటనతో ఎందరో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న హీరో చియాన్ విక్రమ్. ఆయన తనయుడు ధృవ్.. అర్జున్ రెడ్డి రీమేక్ చిత్రంతో వెండితెరకి పరిచయం కానున్న సంగతి తెలిసిందే. ఆదిత్య వర్మ అనే టైటిల్‌తో తమిళంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుండగా, అతి త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. కట్ చేస్తే ఇప్పుడు విక్రమ్ ఫ్యామిలీ నుండి మరొకరు హీరోగా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. విక్రమ్ చె÷–లలెలు అనితా తనయుడు అర్జుమాన్ పొల్లద ఉలగిల్ బయంగర గేమ్ అనే చిత్రంతో త్వరలో కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇప్పటికే ఆయనకి సంబంధించిన లుక్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. యాక్టింగ్‌పై చాలా ఆసక్తి ఉన్న నేపథ్యంలో అర్జుమాన్‌ని ఇండస్ట్రీలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారట విక్రమ్. అర్జుమాన్ డెబ్యూ చిత్రాన్ని విజయ్ శ్రీ.జి తెరకెక్కించనుండగా, జీడీఆర్ ప్రొడక్షన్స్ బేనర్‌పై నిర్మితం అవుతుంది. బిగ్ బాస్ ఫేం ఐశ్వర్య దత్తా చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. మొ÷–టటై రాజేంద్రన్, జూలీ క్రైమ్ బ్రాంచ్ ఆఫీసర్స్ పాత్రలో కనిపించనున్నారట. ఈ చిత్రం ప్రేక్షకులకి మంచి వినోదం అందిస్తుందని మేకర్స్ అంటున్నారు.

# 'ఫైటర్'గా విజయ్ దేవరకొండ




'ఇస్మార్ట్ శంకర్' విజయంతో జోరుమీదున్నారు మాస్ దర్శకుడు పూరి జగన్నాథ్. యువ కథానాయకుడు విజయ్ దేవరకొండతో త్వరలో ఓ సినిమా చేయబోతున్నారు. ఇటీవల ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ చిత్రానికి టైటిల్‌ను కూడా ఖరారు చేశారు. పూరి–విజయ్‌ల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రానికి 'ఫైటర్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు.

ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి, ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జనవరి నుంచి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. హీరోలను మాస్ యాంగిల్‌లో తెరపై ప్రెజెంట్ చేసే పూరి జగన్నాథ్.. విజయ్ దేవరకొండలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో కథానాయికగా శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్‌ను తీసుకుంటారని టాలీవుడ్‌లో వార్త హల్‌చల్ చేస్తోంది.

## మళ్లీ సూర్యకు జంటగా కాజల్ ?

కలువ కళ్ల సుందరి కాజల్, తమిళ స్టార్ హీరో సూర్య ఏడేళ్ల క్రితం అంటే 2012లో మాట్రన్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తెలుగులో ఈ చిత్రం బ్రదర్స్ పేరుతో విడుదలైంది. ఈ చిత్రానికి అంతగా ప్రేక్షకాదరణ లభించలేదు. ఈ సినిమా తర్వాత కాజల్, సూర్య మళ్లీ కలిసి ఏ సినిమా చేయలేదు. అయితే కోలీవుడ్ సమాచారం ప్రకారం సూర్య 39వ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా ఎంపికైందట. త్వరలోనే దీనికి సంబంధించి అఫీషియల్ ప్రకటన కూడా రానుందని చెబుతున్నారు. విశ్వాసం ఫేమ్ శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ బేనర్‌పై ఈ చిత్రం నిర్మితం కానుంది. కాజల్ ప్రస్తుతం తెలుగు, తమిళ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కోమలి అనే తమిళ చిత్రంతో మంచి హిట్ కొట్టిన కాజల్ రీసెంట్‌గా రణరంగం చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది.

# కనువిందు చేస్తున్న జూరాల

### కొనసాగుతున్న పర్యాటకుల తాకిడి

### చిరు వ్యాపారులకు కలసివస్తున్న రాబడి

గద్వాల,ఆగస్ట్23(ఆర్ఎన్ఎ): ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో గతంలో ఎన్నడూ లేని విధంగా మరోమారు జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. వరదనీటిని కిందికి వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. దీనిని తిలకించేందుకు గత పక్షం రోజులుగా సందర్శకుల తాకిడి పెరిగింది. దీనికితోడు ఇక్కడ చిరు వ్యాపారాలు కూడా బాగా సంపాదిస్తున్నారు. అలాగే చేపలు పట్టి అప్పటికప్పుడు వండిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటితో కళకళలాడుతుండటం, గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహాన్ని చూసేందుకు జనజాతరలా తరలి వస్తున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా జూరాల ప్రాజెక్టు గేట్లు తెరిచి, దిగువకు భారీగా నీటి విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో తొలిసారిగా భారీగా వరద రావడం, అదే సమయంలో 15 గేట్లు తెరిచి, విద్యుత్ ఉత్పత్తితో కలిపి నీరు నదిలో పారుతుండటంతో ఎడమ వైపు పుష్కరఘాట్ వద్ద నుంచి వీక్షిస్తూ ఉల్లాసంగా గడిపారు. ప్రాజెక్టు నుంచి వెళ్లే వాహన చోధకులు ఆగి, గేట్ల వద్ద కొద్ది సేపు చూసి వెళ్లడం కన్పించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు వద్ద సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. తాజాగా వరుస సెలవులతో మళ్లీ తాకిడి పెరిగింది. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కుటుంబసభ్యులతో, స్నేహితులతో కలిసి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కుడి, ఎడమ వైపున ప్రాజెక్టు పరవళ్లను వీక్షిస్తూ ఆహ్లాదంగా గడిపారు. జూరాల గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను, పరవళ్లతో నురగలు కక్కుతూ శ్రీశైలానికి తరలుతున్న భారీ వరద నీటిని చూసి ఆనంద పరవశులయ్యారు. సెల్ఫీలు తీసుకూంటూ, ఫొటోలు దిగుతూ కనిపించారు. జూరాలను సందర్శించేందుకు ప్రజల తాకిడి పెరగడంతో చిరు వ్యాపారాలూ జోరందుకున్నాయి. ఎడమ కాలువ వైపు చేపల ఫ్రై చేపల పులుసు కోసం సందర్శలు పోటీలు పడ్డారు. అలాగే ఆహ్లాదకర వాతావరణంలో వన భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సందర్శకులు వస్తూనే ఉన్నారు. పోలీసులు బందోబస్తును, ట్రాఫిక్‌ను నియంత్రించారు. పుష్కరఘాట్ వద్ద సందర్శకులను నదిలోపలకు వెళ్లనీయకుండా హెచ్చరికలు జారీ చేసన్తూ బందోబస్తును పర్యవేక్షించారు.

## తాగిన మైకంలో ఉరేసుకున్న యువకుడు

పెద్దపల్లి,ఆగస్టు23 (ఆర్ఎన్ఎ): తాగిన మత్తులో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. సుగ్లం పల్లి గ్రామానికి చెందిన మామిడిల ప్రశాంత్( 27) అనే యువకుడు తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగిన మత్తులో ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# పాక్‌కు షాక్!

న్యూఢిల్లీ, ఆగస్టు23(ఆర్ఎన్ఎ) : ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను పైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఆసియా పసిఫిక్ గ్రూపులో బ్లాక్‌లిస్టు చేశారు. టెర్రర్ ఫండింగ్, మనీ ల్యాండరింగ్ నియంత్రణకు పాక్ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. టెర్రర్ ఫైనాన్సింగ్ విషయంలో ఇప్పటికే పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్‌లిస్టులో పెట్టింది. ఇప్పుడు ఆసియా పసిఫిక్ గ్రూపు కూడా ఆదేశాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టడం గమనార్హం. తాజాగా ఏపీజీ తన రిపోర్ట్‌ను రిలీజ్ చేసింది. మొత్తం 40అంక్షల్లో పాకిస్థాన్ 32అంశాల్లో విఫలమైనట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాలోని కెనబెరాలో ఎఫ్ఏటీఎఫ్ సమావేశం రెండురోజుల పాటు జరిగింది. అనుకున్న ప్రమాణాలను పాకిస్థాన్ చేరుకోకపోవడం వల్ల ఆ దేశాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టినట్లు ఓ భారతీయ అధికారి తెలిపారు. టెర్రర్ ఫైనాన్సింగ్, మనీల్యాండరింగ్‌కు చెందిన 11 అంశాల్లో .. పాక్ పది అంశాల్లో వైఫల్యం

### – బ్లాక్‌లిస్టులో పెట్టిన ఎఫ్ఏటీఎఫ్

### – 40 ఆంక్షల్లో పాక్ 32 అంశాల్లో విఫలం

చెందినట్లు అధికారులు చెప్పారు. అయితే పాక్ మాత్రం గత వారమే సుమారు 450 పేజీల డాక్యుమెంట్‌ను ఏపీజీకి సమర్పించింది. అయినా కానీ ఆ దేశంపై ఈ చర్యలు తప్పలేదు. 27 సూత్రాలతో ఒక కార్యాచరణ ప్రణాళికను ఇచ్చింది. దీనిపై గత ఏడాది అక్టోబర్‌లో తొలిసారిగా సమీక్ష జరిగింది. గత ఫిబ్రవరిలో రెండోసారి జరిగింది. జైషే మహ్మద్ సహా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న పలు ఉగ్రవాద ముఠాలకు సంబంధించి కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేసింది. అయినా పాకిస్థాన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో గత జూన్‌లో మరోసారి పాక్‌ను తీవ్రంగా హెచ్చరించింది. ఉగ్రవాద ప్రవాదం పొంచి ఉన్న అంశాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతూ.. వ్యూహాత్మక లోపాలను అధిగమించడానికి ఎఫ్ఏటీఎఫ్ కార్యాచరణ ప్రణాళికను సరిగా అమలు చేయాలని పేర్కొంది. అలాగే అక్రమ నగదు చలామణి, ఉగ్రవాద నిధుల సరఫరా అరికట్టే అంశంలో పాక్ తీసుకుంటున్న చర్యలు ఎఫ్ఏటీఎఫ్ నిబంధన లకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. ఉగ్రవాద ముఠాలకు ఆర్థిక మూలాలతో పొంచి ఉన్న ముప్పుపై సరైన అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేసింది. అయినా పాక్ కంటితుడుపు చర్యలకే పరిమితమవడం గమనార్హం. దీంతో ఎఫ్ఏటీఎఫ్ ఏపీజీ తదుపరి కార్యాచరణను అమలు చేసింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని అరికట్టడం, అక్రమ నగదు చలామణి లాంటి అంశాల్లో ఎఫ్ఏటీఎఫ్ చేసిన సూచనల అమలుకు చివరి గడువైన అక్టోబర్ నాటికైనా లక్ష్యాలను చేరుకోని పక్షంలో పాక్‌కు బ్లాక్ లిస్ట్ ముప్పు తప్పదు.

# సంగారెడ్డి జిల్లాకు పోషణ్ అభియాన్ అవార్డు



హైదరాబాద్ , ఆగష్టు 23 (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాకు పోషణ్ అభియాన్ అవార్డు వరించింది. జిల్లాలో పోషణ్ అభియాన్ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసినందుకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఉత్తమ జిల్లాగా సంగారెడ్డిని ఎంపిక చేసింది. ఈ క్రమంలో ఇవాళ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హన్మంతరావు.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ మోతి, డీఆర్‌డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ కింద 2018–19 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఉత్తమ జిల్లాగా సంగారెడ్డి ఎంపికైన సంగతి తెలిసిందే. గత ఏడాది సెప్టెంబర్ నుంచి జిల్లాలో పోషణ్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం అయింది.

పోషణ లోపం లేని సమాజ నిర్మాణం కోసం కలెక్టర్ హనుమంతరావు జిల్లాలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోషణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలన్ని చైతన్యం చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఇమ్యూనైజేషన్ శాఖల సమన్వయంతో కలెక్టర్ చేసిన కృషి ఫలించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల నుంచి 149 ప్రాజెక్టులు అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపించంగా, అందులో జిల్లా ఉత్తమ జిల్లాగా ఎంపికైంది.

## పోషణ్ అభియాన్ అనగా...

ప్రజల భాగస్వామ్యంతో నడిచే ఒక ఉద్యమమే పోషణ్ అభియాన్. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, పాఠశాల కమిటీలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ సర్పంచులు, ప్రజా సంఘాలు విస్తృతంగా పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపేందుకు కార్యచరణ చేశారు. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌కు అత్యంత ప్రాధాన్యతను కల్పించింది. అందుకే ఆ నెలను జాతీయ పోషకాహార మాసంగా ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం చూచించిన విధంగా జిల్లాలో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. అందుకోసం పోషణ లోపంలేని తెలంగాణ కావాలనే నినాదాన్ని ఎత్తుకున్నారు.

## పోషణ్ అభియాన్‌తో ప్రయోజనం..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్ అభియాన్ వెనుక బలమైన కారణం ఉన్నది. దేశ వ్యాప్తంగా పోషణ లోపం, రక్త హీనత, తక్కువ బరువుతో పుట్టే శిశువుల సంఖ్యను తగ్గించేందుకు ఎన్నో ఏండ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. వివిధ శాఖలు, ప్రభుత్వ విభాగాలు ఇందుకోసం కృషి చేస్తూనే ఉన్నాయి. అయితే పరిపూర్ణమైన లక్ష్యం ఇంకా చేరుకోవాల్సి ఉన్నందున జన పోషణ్ టెక్నాలజీ సహాయంతో లబ్ధిదారులకు శ్రేష్టమైన ఆహారాన్ని అందించేలా పోషణ్ అభియాన్ చేస్తుంది. అయితే జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా జన చైతన్యం కోసం పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలందరూ భాగస్వాములను చేయడం ముఖ్య ఉద్దేశం. దీంతో శక్తవంతమైన రాష్ట్రంగా మార్చేందుకు గట్టి పునాది ఏర్పాడుతుందని ప్రభుత్వ విశ్వాసం. ముఖ్యంగా పోషణ్ అభియాన్‌తో గర్భవతులు, బాలింతలు, శిశువులు, కౌమార బాలికలు, చిన్నారులకు ప్రయోజనం చేకూరుతున్నది.

## కోడెల ఇంట్లో చోరీ కలకలం..

### – కంప్యూటర్ మాయం!

### – ఇవన్నీ కోడెల డ్రామాలంటూ వైకాపా మండిపాటు

### – వైకాపా కార్యాలయంలోని వ్యక్తే దొంగిలించాడన్న కోడెల

గుంటూరు, ఆగస్టు23(ఆంఎన్ఎ) : ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు మరోసారి వార్తల్లో నిలిచారు. అసెంబ్లీ ఫర్నీచర్‌ను ఆయన సొంత ఆఫీసులో వాడుకున్నారని విమర్శలు రావడం, అవసరమైతే డబ్బులు చెల్లిస్తానని ఆయన వివరణ ఇవ్వడం తెలిసిందే. ఫర్నీచర్ తీసుకెళ్లాలని, లేదంటే దానికి తగిన డబ్బులు తీసుకెళ్లాలని కోడెల తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ అధికారులు కోడెల ఇంటికి వచ్చి ఫర్నీచర్ తీసుకెళ్లేందుకు నిర్ణయించారు. వారు కోడెల ఇంటికి వెళ్లడానికి ముందు.. ఆయన నివాసంలో దొంగతనం జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటాక గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని కోడెల ఇంట్లో దొంగతనం జరిగింది.

ఆయన ఆఫీస్ రూంలో ఉంచిన రెండు కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. కరెంట్ పనికి సంబంధించి రిపేర్ చేయడం కోసమని ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి దాటాక కోడెల నివాసంలోకి వెళ్లారు. అనంతరం ఇంట్లోని కంప్యూటర్లను ఎత్తుకెళ్లారు.

# రాజధాని రైతుల త్యాగాలు మర్చిపోవద్దు

### – నదీతీరంలో రాజధాని ఉండటం సానుకూలాంశం

### – రాజధాని మార్చే ఆలోచన ఉంటే వైసీపీ ప్రభుత్వం విరమించుకోవాలి

### – ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, ఆగస్టు23(ఆంఎన్ఎ) : ఏపీ రాజధానిపై రగడ కొనసాగుతోంది. అధికార వైసీపీ, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. జగన్ సర్కార్ నిర్ణయాలపై కాస్త చూసీచూడనట్లు వ్యవహరించే బీజేపీ నేతలు కూడా రాజధాని విషయంలో సీరియస్‌గానే విమర్శలు గుప్పిస్తున్నారు.

రాజధాని మార్చే ఆలోచన చేస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరిస్తున్నారు. తాజాగా ఈ విషయంపై బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్పందించారు. శుక్రవారం ఉదయం రాజధాని ప్రాంత రైతులు కన్నా లక్ష్మీనారాయణను కలిశా రు. గత ప్రభుత్వం అడిగితేనే తమ భూములు ఇచ్చామని, ప్రభుత్వం మారిన తర్వాత ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి బొత్స సత్యానారాయణ వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని వాపోయారు.

రాజధానిలో పనులు పూర్తిగా ఆగిపోయాయని, భూములిచ్చిన రైతులకు ఇప్పుడు కౌలు కూడా ఇవ్వడం లేదని ఆయన దగ్గర వాపోయారు. సీఆర్‌డీఏ అధికారులను కలిసినప్పటికీ వాళ్లు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని కన్నా దృష్టికి తీసుకెళ్లారు. రాజధాని అమరావతిని మార్చకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. రాజధాని తరలిస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై సీఎం జగన్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజధాని ప్రాంతంలో వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. తమ భూముల్లో రాజధాని వస్తుందన్న ఆశతో మూడు పంటలు పండే భూములను రైతులు త్యాగం చేశారని, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ తీరుపైనా ఆయన విమర్శలు చేశారు. ప్రభుత్వం కొందరికే అన్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. రాజధాని మార్చే ఆలోచనచేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతులకు అండగా నిలుస్తామన్నారు. అమరావతిలోనే రాజధాని ఉండాలన్నదే తమ భావన అని కన్నా స్పష్టం చేశారు. రాజధానికి వరద వస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కన్నా ఆరోపించారు. దేశంలో చాలా రాజధానులు నదులు, సముద్రాల పక్కన ఉన్నాయన్నారు. నదీతీరంలో రాజధాని ఉండటం సానుకూల అంశమన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com